

20న 'సండే మార్కెట్' వార్షికోత్సవం

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 17 : నగరంలో సండే మార్కెట్ ఏర్పడి ఈ నెల 20వ తేదీకి 40 ఏళ్లు పూర్తవు తుందని, ఈ సందర్భంగా టౌనుహాలులో వార్షికోత్సవ సదస్సు నిర్వహిస్తున్నట్లు సండే మార్కెట్ వ్యాపారుల సంఘం గౌరవాధ్యక్షుడు కిశోర్‌బాబు తెలిపారు. నగరంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సదస్సుకు జిల్లా మాజీ కలెక్టర్ రాజు, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఝాన్సీ హాజరవుతారని చెప్పారు. సభకు ముందు రక్తదాన శిబిరం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ అధ్యక్షుడు హాఫీ జుద్దీన్, కార్యదర్శి సెంథిల్ కుమార్, కోశాధికారి ముత్తు మారి తదితరులు పాల్గొన్నారు.

సుర్రుమంటున్న సూరీడు!

రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు



వామ్మో.. సురీడు భగ్గుమంటున్నాడు. రెండో వేసవిని తలపించేలా మండిపోతున్నాడు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు భానుడు తన ప్రతాపం చూపుతుండటంతో పిల్లలు, వృద్ధులు అల్లాడిపోతున్నారు. వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు 38 డిగ్రీలు నమోదవుతున్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా ఎండవేడిమి నెల్లూరు, కావలిలో ఉంటోంది. ఈ ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేసవి తీవ్రత వల్ల చెమట రూపంలో రెండున్నర నుంచి మూడు లీటర్ల వరకు నీటిని కోల్పోయే పరిస్థితి వస్తుంది. దీనివల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. మహిళల్లో రోగ నిరోధక శక్తి కూడా తక్కువగా ఉండటంతో చర్మవ్యాధులతోపాటు తలనొప్పి, ఆకలి మందగించడం, మూత్రసంబంధిత వ్యాధులు, మతిభ్రమణం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. ఈ పరిస్థితుల్లో మహిళలు జాగ్రత్తగా ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

- నెల్లూరు (వైద్యం)

వారం రోజుల్లో నమోదైన ఉష్ణోగ్రత

తేదీ	గరిష్ఠం	కనిష్ఠం
11	37.0	27.1
12	38.1	28.5
13	37.8	26.8
14	37.5	29.0
15	36.1	27.4
16	38.2	26.4
17	37.0	20.1

ఇంకా వడివడిగానే..

వంద రోజుల కూటమి ప్రభుత్వ పాలనపై భిన్నాభిప్రాయాలు

'సంక్షేమ'ం సరే.. పాలనలోనే కనిపించని బాబు మార్కు

నాటి వైసీపీ పరిస్థితులే నేడూ అంటూ ప్రజల నిట్టూర్పు

కూటమి శ్రేణుల్లోనూ నిరాశ, నిస్పృహ

కొత్తవారిని అక్కున చేర్చుకుని, పాతవారిని వదిలేశారన్న ఆవేదన

ప్రజామోదంతో అఖండ విజయం సాధించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పట్ల ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సంక్షేమం, అభివృద్ధి విషయాల్లో కొద్ది రోజుల్లోనే ముఖ్యమంత్రి చంద్రబాబు తన ముద్ర వేస్తుండగా.. స్థానిక పాలన విషయంలో మాత్రం అటు ప్రజల్లోనూ, ఇటు అధికార తెలుగుదేశం పార్టీలోనూ పెదవి విరుపులే వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ప్రస్తుతం నడుస్తున్న పాలన వైసీపీ పాలనకు కొనసాగింపుగా కనిపిస్తోంది తప్ప చంద్రబాబు మార్కు పాలన ఇంకా ఆరంభం కాలేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

నెల్లూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రైతుల జీవనాడి అయిన సోమశిల డ్యాంను గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా ప్రమాదస్థితికి చేరుకుంది. అప్రాన్ కొట్టుకుపోయినా పట్టించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యం వహించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, మరో మంత్రి పొంగూరు నారాయణ చొరవ తీసుకొని సోమశిల ప్రమాద స్థితిని సీఎంకు వివరించారు. ప్రాజెక్టుల విలువ తెలిసిన చంద్రబాబు ప్రభుత్వం తొలి 60 రోజుల్లోనే శ్రీకారం చుట్టింది. రూ.99 కోట్ల వ్యయంతో అప్రాన్ పనులు మొదలు పెట్టడం ద్వారా పెను ముప్పు నుంచి ప్రాజెక్టుకు విముక్తి లభించింది.



కానీ.....!!



చంద్రబాబు అధికారంలోకి వచ్చి వంద రోజులు గడుస్తున్నా ఇంకా ఆయన మార్కు పాలన ఆరంభం కాలేదనే బాధ కన్నా వైసీపీ పాలనకు కొనసాగింపుగానే కనిపిస్తోంది తప్ప పెద్దగా మార్పు లేదనే పరిస్థితులే ప్రజలను, టీడీపీ శ్రేణులను ఎక్కువగా బాధిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు ప్రకృతి వనరులను దోచుకున్నారు. ఇప్పటి కూటమి నాయకుల్లో కొంతమంది వైసీపీ నాయకుల కన్నా మేమేం తక్కువ అన్నట్లు సహజ వనరుల దోపిడీకి తెరతీశారు. గత ప్రభుత్వంలో పోలీసు స్టేషన్లలో వారి పెత్తనమే జరిగింది. స్టేషన్లలో కూర్చుని వైసీపీ నాయకులు పంచాయితీలు చేశారు. ఇప్పుడు కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది. విశేషం ఏమంటే గత వైసీపీ ప్రభుత్వంలో ఏ రౌడీ షీటర్లు అయితే పంచాయితీలు చేశారో, వారిలో చాలా మంది ఇప్పుడు కూటమి జెండాలు కప్పుకొని దందాలు చేస్తున్నారని అపవాదు నెలకొంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తి ప్రతిపక్షాలను, ప్రజలను పీల్చుకుతిన్న పలువురు పోలీసు అధికారులు ఇప్పుడు కూటమి నాయకుల పంచన చేరి వారి మద్దతుతో జిల్లా సరిహద్దులు దాటకుండా ఇక్కడే తిష్ట వేసి కూర్చున్నారు. ఇవన్నీ ప్రత్యక్షంగా చూస్తున్న ప్రజలకు ఇది వైసీపీ పాలనకు కొనసాగింపుగానే కనిపిస్తోంది తప్ప చంద్రబాబు పాలనగా అనిపించలేదు.

ప్రజల అభిప్రాయాలు ఇలా ఉంటే టీడీపీ కార్యకర్తల గోడు మరోలా ఉంది. స్థానిక సంస్థల్లో బలం పెంచుకునే క్రమంలో వైసీపీ కార్పొరేటర్లు, కౌన్సిలర్లను, నాయకులను టీడీపీలోకి తీసుకొంటున్నారు. ఇది టీడీపీ కార్యకర్తల్లో తీరని వేదన రగిలిస్తోంది. ఐదేళ్ల కాలం ఎవరి అరాచకాల కారణంగా వేధింపులకు గురయ్యారో, వారినే ఇప్పుడు తీసుకొచ్చి అందలం ఎక్కించుకోవడాన్ని ఆ పార్టీ కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. చంద్రబాబును నేరుగా కలిసే అవకాశం లేక, స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలకు ఎదురుతిరిగే ధైర్యం లేక సామాజిక మాధ్యమాల్లో స్వపక్షంలోనే ప్రతిపక్షంలా నిరసన గళం వినిపిస్తున్నారు. ఇప్పటివరకు పాలనా పరంగా పెద్దగా మార్పు కనిపించకపోయినా త్వరలో ఈ పరిస్థితుల్లో మార్పు వస్తుందని, విపత్తులు, ఉప్పెనల నుంచి రాష్ట్రం కోలుకున్న వెంటనే పాలనపై దృష్టి సారిస్తారని, త్వరలోనే జిల్లాలో చంద్రబాబు మార్కు పరిపాలన ఆవిష్కృతం అవుతుందని ప్రజలు, పార్టీ కార్యకర్తలు విశ్వసిస్తున్నారు.





- ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా పింఛన్ల పెంపుతో అవ్వాతాతలను కూటమి ప్రభుత్వం ఆదుకుంది. అన్న క్యాంటీన్ల పునరుద్ధరణతో పట్టణ పేదల కడుపులు నింపే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మిగిలిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేసే దిశగా చంద్రబాబు ప్రభుత్వం పయనిస్తోందన్న నమ్మకం ప్రజల్లో ఏర్పడింది.
- ఇంకా మొదలవ్వని చంద్రన్న పాలన అధికారంలోకి వచ్చిన వంద రోజుల కాలంలోనే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడం పట్ల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతున్నా పాలన పరంగానే పెదవి విరుస్తున్నారు. ఇంకా చంద్రన్న పాలన ఆరంభం కాలేదనే భావిస్తున్నారు. నిష్పాక్షిక పాలనే చంద్రబాబుకు ఉన్న ప్రత్యేకత. అదే ఆయన ఆకర్షణ. ఆయన పాలనా దక్షతపై ఉన్న నమ్మకంతోనే రాష్ట్రం విడిపోయిన ప్రత్యేక పరిస్థితుల్లో 2014-19లో చంద్రబాబే కావాలని ప్రజలు గెలిపించు కున్నారు. వైసీపీ అరాచక పాలన పట్ల విసిగిపోయి, అన్ని వర్గాల్లో అభద్రతా భావం కలిగిన క్రమంలోనే చంద్రబాబు నాయకత్వాన్ని కోరుకొంటూ ఎన్డీఏ కూటమిని అఖండ మెజారిటీతో గెలిపించారు.

మర్యాద.. మర్యాద...!

నెల్లూరు (హరనాథపురం : రాష్ట్ర ఖజానాకు ఆయువు పట్టు లాంటి రిజిస్ట్రేషన్ శాఖకు అన్ని రకాల పన్నులు కడుతున్న ప్రజలకు గౌరవ మర్యాదలు ప్రారంభమయ్యాయి. మొన్నటివరకు ఎర్ర తివాచీ నడుమ అరడగు ఎత్తులో కూర్చొన్న సబ్ రిజిస్ట్రార్ ఇప్పుడు సాధారణ అధికారిలా కుర్చీలో కూర్చొని రిజిస్ట్రేషన్ లావాదేవీలు నడిపారు. కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు మంగళవారం జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్నేహపూర్వక సేవలు ప్రారంభమయ్యాయి. కార్యాలయాల్లో రాచరిక పోకడలను తలపిస్తున్న ఎర్రతివాచీ పోడియంలను సమూలంగా తొలగించారు. సబ్ రిజిస్ట్రార్ కుర్చీ ఎత్తునూ తగ్గించారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలకు ప్రత్యేకంగా సబ్ రిజిస్ట్రార్ ఎదురుగానే కుర్చీలు ఏర్పాటు చేశారు. అంతేకాదండోయ్.. ప్రత్యేక గదిని ఏర్పాటు చేసి అక్కడా కుర్చీలను ఏర్పాటు చేశారు. దస్తావేజుల కంప్యూటర్ స్కానింగ్ రూములో ఇబ్బందులు తొలగించడంతోపాటు మంచి నీటి వసతి కల్పించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సమూల మార్పులు తెచ్చామని రిజిస్ట్రార్ బాలాంజనేయులు తెలిపారు.



నెల్లూరులోని ప్రధాన సబ్ రిజిస్ట్రార్ పోడియం ఎత్తు తొలగించి, సబ్ రిజిస్ట్రార్ కుర్చీ, ఆయన ఎదురుగా ప్రజలు కోసం ఏర్పాటు చేసిన కుర్చీలు

గ్యాస్ సిలిండర్ డెలివరీ ఉచితం

నెల్లూరు(హరనాథపురం) : వంట గ్యాస్ సిలిండర్ డెలివరీ చార్జీల విషయంలో ప్రభుత్వం సామాన్యులకు తీపి కబురు వినిపించింది. గ్యాస్ ఏజెన్సీ నుంచి 15 కి.మీ.లోపు ఉన్న నివాసాలకు ఏలాంటి డెలివరీ చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని ప్రకటించింది. 15 కి.మీ. దాటితే రూ.30 డెలివరీ చార్జీగా వసూలు చేయాలని రాష్ట్ర పౌర సరఫరాలశాఖ కమిషనర్ జిల్లా అధికారులకు ఆదేశాలిచ్చారు. గ్యాస్ సిలిండర్ డెలివరీ బాయ్స్ అధిక మొత్తంలో డెలివరీ చార్జీలు వసూలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ఏజెన్సీ నుంచి నిర్దేశిత దూరంలోపు ఉన్న ఇళ్లకు ఉచితంగా సిలిండర్ డెలివరీ చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ అది అమలుకావడం లేదు. డెలివరీ సిబ్బంది ఇష్టప్రకారం రూ.30 నుంచి రూ.80 వరకు నుంచి వసూలు చేస్తున్నారు. ఎవరైనా వినియోగదారులు డెలివరీ చార్జీలు ఇవ్వకుంటే బాయ్స్ ఒప్పుకోవడం లేదు. ఈ విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోవటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజా ఉత్తర్వులిచ్చింది.

అదనంగా అడిగితే చర్యలు తప్పవు

గ్యాస్ సిలిండర్ డెలివరీకి అదనపు మొత్తాన్ని వసూలు చేస్తే గ్యాస్ ఏజెన్సీపై చర్యలు తీసుకుంటాం. గ్యాస్ ఏజెన్సీ పరిధిలోని 15 కి.మీ.లోపు ప్రాంతాల్లో సిలిండర్ డెలివరీ ఉచితం. అంతకన్నా ఎక్కువ దూరానికి రూ.30 చెల్లించాలి.

- డీవీ రమణ, డీఎస్‌వో

వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఇసుక అక్రమాల బాగోతాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. నాడు అధికారమే అండగా అక్రమార్కులు చెలరేగారు. పెన్నమ్మను కుళ్లబొడిచి రూ.వేల కోట్ల విలువైన ఖనిజాన్ని దోచుకుతిన్నారు. అప్పటి ప్రభుత్వ పెద్దలే ఇందుకు సహకారం అందించడంతో అధికార వ్యవస్థ కూడా ఈ ఇసుక తవ్వకాల వైపు కన్నెత్తి చూసేందుకు కూడా సాహసించలేదు. కానీ ఇప్పుడు ప్రభుత్వం మారి ఎన్డీయే ప్రభుత్వం రావడంతో నాటి అక్రమాల పుట్ట బద్దలవుతోంది. ప్రభుత్వ ఆదేశాలతో జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ఇసుక తవ్వకాలపై అటు మైనింగ్, ఇటు ఏసీబీ అధికారులు విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించారు. ఈ నివేదికలోని అంశాలను పరిశీలిస్తే కళ్లు చెదురుతున్నాయి. దాదాపు రూ.332 కోట్ల విలువైన ఇసుకను అక్రమంగా తవ్వి తరలించినట్లు లెక్కలు చెబుతున్నాయి. అంటే ఏ స్థాయిలో ఇసుకను కొల్లగొట్టారో స్పష్టమవుతోంది.

- నెల్లూరు, ఆంధ్రజ్యోతి


దోచిన ఇసుక విలువ రూ.332 కోట్లు

- పెన్నమ్మను కుళ్లబొడిచిన ఇసుకాసురులు
- 14 ప్రాంతాల్లో మైనింగ్, ఏసీబీ అధికారుల విచారణ
- 16.62 లక్షల మెట్రిక్ టన్నుల ప్రకృతి సంపదను కొల్లగొట్టారు
- వైసీపీ ప్రభుత్వంలో దర్జాగా సాగిన దోపిడీ
- అక్రమార్కులకు జరిమానా విధింపు
- కేసుల నమోదుకు సన్నద్ధం

పెన్నమ్మ ఒడ్డున నెల్లూరు జిల్లా ఉన్నప్పటికీ వైసీపీ ప్రభుత్వంలో జిల్లా వాసులకు మాత్రం ఇసుక బంగారంగా మారింది. అంతకముందు ప్రభుత్వంలో ఉచితంగా దొరికే ఇసుకను వైసీపీ ప్రభుత్వం విక్రయించడం ప్రారంభించింది. నాడు ట్రాక్టర్ ఇసుక రూ.1500 వస్తే వైసీపీ ప్రభుత్వంలో రూ.5 వేలకు పెరిగింది. దానిని తెచ్చుకోవాలన్నా నానా తంటాలు పడాల్సి వచ్చేది. కానీ జిల్లా నుంచి మాత్రం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు యథేచ్ఛగా ఇసుక తరలివెళ్లింది. నిత్యం వందల లారీలు ఇతర రాష్ట్రాలకు వెళ్లాయి. అయితే నాడు ఒక్కరంటే ఒక్క అధికారి కూడా ఈ లారీలను పట్టించుకున్న దాఖలాలు లేవు. కనీసం ఇసుక రీచ్‌లో తవ్వకాలు ఎలా జరుగుతున్నాయో పరిశీలించే సాహసం కూడా చేయలేదు. ఎవరైనా ఆ రీచ్‌ల వైపు వెళితే బదిలీ తప్పదు అన్నట్టుగా ఉండేది పరిస్థితి. కానీ ప్రభుత్వం మారడంతో ఇసుక అక్రమాల డొంక కదిలింది. జిల్లాలో అనుమతులిచ్చిన రీచ్‌లతోపాటు అనధికారిక ప్రాంతాల్లో కూడా అక్రమంగా తవ్వకాలు జరిగినట్లు గుర్తించిన ఎన్డీయే ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. పెన్నా నదిలో మొత్తం 14 ప్రాంతాల్లో విచారణ జరపాలని ఉత్తర్వులిచ్చింది. దీంతో మైనింగ్ అధికారులు దాదాపు నెల రోజుల పాటు ఈ రీచ్‌లలో గుంతలను కొలతలు తీసి అక్రమాలు నిగ్గు తేల్చారు. అదే సమయంలో ఏసీబీ అధికారులు కూడా విచారణ మొదలుపెట్టారు. ఇలా ఈ రెండు విభాగాలు వేర్వేరుగా విచారణలు జరిపి ప్రభుత్వానికి నివేదికలు అందజేశాయి. మొత్తం 14 ప్రాంతాల్లో 8.36 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలకు అనుమతులిస్తే ఏకంగా 25 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను తవ్వినట్లు నిర్ధారించారు. అందుకు సంబంధించి ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.332.56 కోట్లు పెనాల్టీలు విధించారు.

● ఈ ప్రాంతాల్లో కొల్లగొట్టారు

విరువూరు, ముదివర్తి, పల్లిపాడు, మినగల్లు ప్రాంతాల్లో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరిపినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. మినగల్లులో 2.3 లక్షల మెట్రిక్ టన్నులు, విరువూరులో 1.85 లక్షలు, పల్లిపాడులో 2.35 లక్షలు, ముదివర్తిలో 2.78 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను కొల్లగొట్టారు. ఇక వేగూరు, కోడూరుపాడు, లేగుంటపాడు, వెంకటేశ్వరపురం ప్రాంతాల్లో రీచ్‌లు లేకపోయినా అక్రమార్కులు ఇక్కడ తవ్వకాలు జరిపారు. గత ప్రభుత్వంలో తొలుత జేపీ, ఆ తర్వాత ప్రతిమ సంస్థలు తవ్వకాలు జరిపాయి. ఈ రెండు సంస్థలు అధికారికంగా తవ్వకాలు జరిపిన రీచ్‌లలోనూ అక్రమాలు జరిగినట్లు విచారణలో వెల్లడైంది. కాగా ఇంత భారీస్థాయిలో అక్రమాలు జరిగాయని నిర్ధారణ జరగడంతో బాధ్యులపై కేసులు పెట్టేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఏ రీచ్‌లో ఎవరెవరు తవ్వకాలు జరిపారు? ఇతర రాష్ట్రాల్లో ఎక్కడికి తరలించారు? అన్న వివరాలను ఏబీసీ అధికారులు సేకరించారు. ఈ వివరాల ఆధారంగా అక్రమార్కులపై కేసులు పెట్టడంతోపాటు ప్రజాధనం రికవరీకి కూడా ఆలోచన చేస్తున్నారు.





డీసిల్టేషన్ పేరుతో సంగం బ్యారేజీకి ఎగువభాగంలో పెన్నానదిలో ఇసుక తరలించగా ఏర్పడిన భారీ గుంతలు (ఫైల్)

● మొదటి మూడేళ్లు ఇంకెంతో..!

ఇప్పుడు జరిగిన విచారణ అంతా 2022, 2023లో జరిగిన తవ్వకాలకు సంబంధించినదే. 2021 వరకు జరిగిన తవ్వకాలన్నీ అప్పుడు వచ్చిన భారీ వరదతో కనుమరుగయ్యాయి. 2019, 2020, 2021 సంవత్సరాల్లోనూ విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరిగాయి. తొలుత ఏపీఎండీసీ సంస్థ నేరుగా తవ్వకాలు జరపగా ఆ మాటున వైసీపీ నేతలు కొల్లగొట్టారు. అప్పుడు ఏ స్థాయిలో అక్రమాలు జరిగాయన్నది నిర్ధారించడం అధికారు లకు కష్టంగా మారింది. అయితే అప్పుడు కూడా ఇదేస్థాయిలో అక్రమాలు జరిగి ఉంటాయని అంచనా వేస్తున్నారు. అందుకు సంబంధించి శాటిలైట్ ఇమేజస్ ద్వారా విచారించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కాగా ఈ విచారణపై మైనింగ్ డీడీ శ్రీనివాసకుమార్‌ను వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఇసుక తవ్వకాలు జరిగిన ప్రాంతాల్లో విచారణ జరిపామని చెప్పారు. ఎక్కడెక్కడ ఏ స్థాయిలో పరిమితికి మించి తవ్వకాలు జరిపారన్నది గుర్తించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు చెప్పారు.

రీచ్‌ల వారీగా ఇసుక అక్రమాల వివరాలు...

ప్రాంతం	అనుమతి (మెట్రిక్ టన్నులు)	తవ్వింది (మెట్రిక్ టన్నులు)	అక్రమ తవ్వకం	పెనాల్టీ (రూ.కోట్లు)
వేగూరు	-	1,86,187	1,86,187	37.23
కోడూరుపాడు	-	74,395	74,395	14.87
లేగుంటపాడు	-	1,13,816	1,13,816	22.76
ముదివర్తి-1	37,637	1,52,969	1,15,333	23.06
ముదివర్తి-2	72,000	3,50,376	2,78,376	55.67
ముదవర్తి-3	72,600	79,853	7253	1.45
ముదవర్తి-4	70,350	1,36,580	66,230	13.24
పీకేపాడు	73,755	1,25,500	51,745	10.34
పల్లిపాడు-1	72,150	3,07,154	2,35,004	47
పల్లిపాడు-2	74,100	1,32,938	58,838	11.76
వెంకటేశ్వరపురం	–	25,786	25,786	5.15
విరువూరు	73,350	2,58,350	1,85,000	37
గొల్లకందుకూరు	2,17,200	2,51,916	34,716	6.94
మినగల్లు	73,350	3,03,483	2,30,133	46.02
మొత్తం	8,36,492	24,99,303	16,62,812	332.56

పక్షం రోజులు 'స్వచ్ఛత హి సేవ'

● పరిశుభ్రతలో ప్రతీ ఒక్కరి భాగస్వామ్యం అవసరం : జేసీ



పరిశుభ్రతను పాటిస్తామని ప్రమాణం చేయిస్తున్న అధికారులు

నెల్లూరు(సిటీ) : మన ఇంటితోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతీ ఒక్కరి భాగస్వాములు కావాలని జాయింట్ కలెక్టర్ కార్తీక్ పిలుపు నిచ్చారు. స్వచ్ఛ భారత్ మిషన్ దేశవ్యాప్తంగా ప్రారంభమై పదేళ్లు పూర్తయిన సందర్భంగా మంగళవారం నెల్లూరులోని వీఆర్సీ కూడలి నుంచి గాంధీబొమ్మ వరకు విద్యార్థులతో కలిసి స్వచ్ఛత హి సేవపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇందులో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజతో కలిసి జేసీ మాట్లాడారు. 15 రోజులు జరిగే స్వచ్ఛత హి సేవ కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా అధికారులు పెంచలయ్య, సుస్మిత, కన్నమనాయుడు, సాంబశివారెడ్డి, చెన్నుడు పాల్గొన్నారు.

అమ్మా, నాన్న నన్ను క్షమించండి..!

- ఉత్తరం రాసి కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం
- గడ్డి మందు తాగి ఘాతుకం
- బలవన్మరణానికి అప్పులబాధే కారణం

సంగం, సెప్టెంబరు 17: అప్పుల బాధ తాళలేక మండలంలోని పడమటిపాళెంకి చెందిన ఓ కానిస్టేబుల్ మంగళ వారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడు రాసిన ఉత్తరంలోని వివరాల మేరకు, విడవలూరుకు చెందిన యల్లసిరి రమేష్(40) డిగ్రీ (కంప్యూటర్స్) చదివాడు. 2012లో కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చింది. 2013లో సంగం మండలం పడమటిపాళెం గ్రామానికి చెందిన నిరోషాతో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. వివాహమైన కొన్నాళ్లకు మామ నాగేశ్వరరావు మృతి చెందడంతో భార్యతో పడమటిపాళెంకు వచ్చి ఉంటున్నాడు. భార్య గ్రామంలో వ్యవసాయం చేసుకుంటుండగా, రమేష్ ఏఎస్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వ్యవసాయం కోసం గ్రామానికి చెందిన జడ్పీటీసీ సభ్యురాలు రావులలక్ష్మి భర్త రావుల ప్రసాద్ గౌడ్ దగ్గర రూ. 3లక్షలు అప్పు చేశాడు. పొలం సాగు చేయడంతో పంట దెబ్బతిని నష్టం వచ్చింది. దీంతో అప్పు చెల్లించలేకపోయాడు. అప్పు తీసుకుని మూడేళ్లు కావడంతో ఒత్తిడి పెరిగింది. ఈ క్రమంలో ప్రసాద్‌గౌడ్‌కి ప్రామిసరీ నోటు తిరగ రాసిచ్చాడు. దీంతో కొంత కాలం గమ్మునున్న ప్రసాద్‌గౌడ్ మళ్లీ బాకీ అడడగడం ప్రారంభించాడు. కాగా రమేష్ కూడా తన డబ్బులు సుమారు రూ. ఆరేడు లక్షలు కొంత మందికి అప్పుగా ఇచ్చి ఉన్నాడు. వారు తిరిగి ఇవ్వకపోగా, తాను తీసుకున్నవారి నుంచి ఒత్తిడి ఎక్కువైంది. ఈ నేపథ్యంలో ఈ రోజు డబ్బులు ఇవ్వకపోతే ఇంటికి వచ్చి గొడవ చేస్తానని ప్రసాద్‌గౌడ్ చెప్పడంతో ఒత్తిడి తట్టుకోలేక గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు.

● నాకు రావాల్సిన డబ్బులు పిల్లలకివ్వండి

ఉత్తరంలో భార్య, కుమారుడి పేర్లు రాసి 'మిమ్మల్ని మోసం చేసి చనిపోతున్నందుకు నన్ను క్షమించండి, సాత్విక్, నివేదిత మీరు బాగా చదువుకోవాలి.. ఐ మిస్ యూ.. అమ్మా, నాన్న, అక్కా.. నన్ను క్షమించండి. నా దగ్గర డబ్బులు తీసుకున్న అంకిరెడ్డి, తలమంచి మల్లికార్జున, తాతా బాలకృష్ణ నాకు ఇవ్వడం లేదు. దయ ఉంచి ఆ డబ్బులు మా పిల్లలకి ఇవ్వాలని కోరుతున్నా' అని ఎస్పీకి ఉత్తరం రాసి గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గుర్తించిన కుటుంబ సభ్యులు రమేష్‌ను బుచ్చిలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్య కోసం నెల్లూరులోని అపోలో వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ విషయంలో పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

స్కూటీ నుంచి పడి ఒంగోలు పీటీసీ ఏవో మృతి

నెల్లూరు (రూరల్/క్రైం), సెప్టెంబరు 17 : నెల్లూరులోని ఇరుకళల పరమేశ్వరి దేవస్థానం సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒంగోలు పోలీసు ట్రైనింగ్ సెంటర్ (పీటీసీ) ఏవో లక్ష్మీగీత (46) మృత్యువాత పడ్డారు. పోలీసులు అందిం చిన సమాచారం మేరకు.. ఒంగో లు పీటీసీలో ఏవోగా పని చేస్తున్న లక్ష్మీగీత పొట్టిపాళెం వద్ద నున్న శ్రీవారి విల్లాల నుంచి నెల్లూరుకు స్కూటీపై వస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడిపోయారు. స్థానికుల సమాచారంతో 108 వాహనంలో నెల్లూరులోని ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ప్రమాదం జరిగిన తీరు తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు. లక్ష్మీగీతకు పెళ్ళై పిల్లలున్నారు. కాగా, లక్ష్మీగీత మృతికి ఏపీ పోలీసు అధికార సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద రావు, రాష్ట్ర నాయకుడు శ్రీహరి ఓ ప్రకటనలో సంతాపం తెలిపారు. లక్ష్మీగీత గతంలో నెల్లూరు జిల్లా పోలీసు కార్యాలయంలో సెక్షన్ సూపరింటెండెంట్‌గా పనిచేశారు. పలువురు పోలీసు అధికారులు మినిస్ట్రీయల్ సిబ్బంది ఆమె మృతికి సంతాపం తెలిపారు.


లక్ష్మీగీత (ఫైల్)

లారీ బైక్‌ను ఢీకొన్న ఘటనలో..

కావలి రూరల్, సెప్టెంబరు 17: తాళ్లపాలెం సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జువ్విగుంటపాలెంకు చెందిన నెల్లూరు సుబ్బారావు (45) అక్కడికక్కడే మృతి చెందాడు. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. సుబ్బారావు పక్కింట్లో ఉన్న మంచాల శ్రీకాంత్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై కావలికి బయలుదేరాడు. మార్గమధ్యలో తాళ్లపాలెం మలుపు వద్ద ఎదురుగా వస్తున్న లారీ, మోటారుసైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటారు సైకిల్‌ను నడుపుతున్న సుబ్బారావు ఎగిరి కిందపడగా అతనిపై లారీ టైరు ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌ను మెరుగైన వైద్యం కోసం నెల్లూరు అపోలో వైద్యశాలకు తరలించారు. సుబ్బారావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్య వెంకట స్రవంతి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. రూరల్ సీఐ రాజేశ్వరరావు ఈ మేరకు కేసు నమోదు చేశారు.

చెట్టు కొమ్మ పడి ఆర్టీసీ డ్రైవరు..

కోవూరు, సెప్టెంబరు 17: కోవూరులోని ఆర్టీసీ రీట్రేడింగ్ జోనల్ వర్క్‌షాపులో మంగళ వారం చెట్టు కొమ్మ పడి ఓ ఆర్టీసీ డ్రైవరు మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా పుత్తూరుకు చెందిన ఆర్టీసీ డ్రైవరు శ్రీరాములు(61) పుత్తూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును రీట్రేడింగ్‌కు కోవూరులోని ఆర్టీసీ రీట్రేడింగ్ జోనల్ వర్క్‌షాపునకు తీసుకువచ్చారు. ఆయన సాయంత్రం చెట్టు కింద కూర్చుని ఉండగా చెట్లపైన చేరిన కోతులు కొమ్మలపై దూకే క్రమంలో ఓ కొమ్మ విరిగి చెట్టు కింద ఉన్న డ్రైవరు శ్రీరాములుపై పడింది. అది చెవిపై దిగబడడంతో తీవ్ర గాయమై రక్తస్రావం జరిగి ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనతో ఆర్టీసీ రీట్రేడింగ్ కార్మికుల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.


డ్రైవరు శ్రీరాములు మృతదేహం

కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్‌ను సాధించుకుందాం

కావలి టౌన్, సెప్టెంబరు 17: కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్ సాధనకు ఆదివారం సాయంత్రం నెల్లూరు ముత్తుకూరు బస్టాండ్ ఎదుట నిర్వహించనున్న బహిరంగసభను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు పసుపులేటి తిరుపాలు కోరారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బహిరంగసభకు చెందిన గోడపత్రికలను ఆవిష్కరించారు. అదాని కృష్ణపట్నం పోర్టును కొనుగోలు చేసి ఇక్కడి ఎగుమతులు, దిగుమతుల కంటైనర్‌ను తమిళనాడుకు తరలించడం మన జిల్లావాసుల ఉపాధి అవకాశాలకు గండి కొట్టడమే అన్నారు. జిల్లాకు తలమానికంగా ఉన్న పోర్టుని నిర్వీర్యం చేయడం దుర్మార్గమని, పోర్టులో కంటైనర్ టర్మినల్ సేవలను కొనసాగించేలా ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో బాబురావు, చెన్నయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 17: పట్టణంలోని గాజులవీధిలో మంగళవారం ఓ వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కథనం మేరకు... వింజమూరుకి చెందిన సయ్యద్ షరీఫ్, పార్వతీపురం జిల్లా వీరఘట్టం మండలం హుస్సేన్‌పురానికి చెందిన తోట విస్సిరాణి(23)ని గతేడాది ఆగస్టులో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి రెండు నెలల పాప. షరీఫ్‌కు మొలల వైద్యం తెలుసు. ఉదయగిరిలో వైద్యశాలలో ఏర్పాటుకు నెల క్రితం వచ్చి గాజులవీధిలో అద్దెకు ఇల్లు తీసుకొని ఆ పనుల్లో నిమగ్నమయ్యాడు. అయితే మధ్యాహ్నం షరీఫ్‌కు తెలిసిన వారు నగదు ఇచ్చేందుకు ఫోన్ చేయడంతో బయటకు వెళ్లాడు. ఆ సమయంలో విస్సిరాణి పాపను హాల్‌లోని ఊయలలో వేసి స్నానానికి వెళ్లింది. షరీఫ్ తిరిగి ఇంటికి వచ్చాడు. పాప హాల్‌లోని ఊయలలో నిద్రపోతుండగా, స్నానం చేసేందుకని గదిలోకి వెళ్లిన భార్య తలుపులు వేసుకొని ఎంతసేపటికి బయటకు రాక పోవడం, తలుపులు తీసేందుకు ప్రయత్నించగా వీలుకాలేదు. దీంతో ఇంటికి వెనుకవైపున్న సన్‌సైడ్ ఎక్కి కిటికీలో నుంచి చూడగా గదిలో చీరతో ఫ్యాన్‌కు ఉరి వేసుకోనుండడాన్ని గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ శ్రీనివాసులు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సాయంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా ఉరేసుకొని విస్సిరాణి మృతిచెందింది. వెంటనే మృతదేహాన్ని కిందకు దింపి పోస్టుమార్టం కోసం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆమె మృతికి గల కారణాలు తెలియరాలేదు. ఈ మేరకు పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


విస్సిరాణి మృతదేహం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	127
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7061
వెండి కిలో ధర	రూ. 90,100
వెండి ఒక గ్రాము	రూ. 93.10

20న వీఎస్‌యూలో జాబ్‌మేళా

వెంకటాచలం, సెప్టెంబరు 17 : మండలంలోని కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఈనెల 20వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వర్సిటీ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవల ప్‌మెంట్ కార్పొరేషన్, జిల్లా ఎంప్లాయిమెంట్, సీడాప్‌తో వీఎస్‌యూ సంయుక్తంగా కలిసి ఈ జాబ్‌మేళానిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాబ్ మేళా నిర్వహిస్తామని, ప్రముఖ కం పెనీలు విచ్చేసి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలను కల్పించనున్నారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 18 నుంచి 28 ఏళ్ల వారు ఎస్ఎస్‌సీ నుంచి డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా చదివిన నిరుద్యోగ యువత హాజరుకావచ్చని పేర్కొన్నారు. జాబ్‌మేళాకు వచ్చేవారు ఆధార్‌కార్డు, బయోడేటా లేదా రెస్యూమ్ తీసుకొని రావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 7989613024, 9573482179ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

'ఉపాధి' కల్పించాలని ఆందోళన

పనులు కల్పించాలని స్థానిక ఉపాధి కార్యాలయం ఎదుట మంగళవారం మండలంలోని గండిపాళెంకి చెందిన పలువురు ఉపాధి కూలీలు ఆందోళన చేపట్టారు. ఉపాధి పనే జీవనాధారమైన తమకు వారం రోజులుగా పని కల్పించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. అధికారులు పరిశీలించి పని కల్పించాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో ఈశ్వరమ్మను కలిసి సమస్యను వివరించారు. పని కల్పిస్తామని ఆమె హామీ ఇవ్వడంతో వారు వెనుతిరిగారు.

- ఉదయగిరి రూరల్



చేనేత సంఘాలకు జీవం

- ఎన్నికల ఏర్పాట్లకు కూటమి ప్రభుత్వం చర్యలు
- నేటి నుంచి ప్రక్రియ మొదలు
- డిసెంబరులో ఎలక్షన్లకు అవకాశం

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 17 : వైసీపీ ఐదేళ్ల పాలనలో చేనేతలను గాలికొదిలేశారు. చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. అంతేకాకుండా ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. నిధుల్లేక ఉత్పత్తి నిలిచిపోయి కార్మికులకు పనిలేకుండా పోయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇచ్చిన మాట ప్రకారం సహకార సంఘాలకు ఊపిరి పోసేందుకు చర్యలు ప్రారంభించింది. బుధ వారం నుంచి ఈప్రక్రియ మొదలుకా నుంది. డిసెంబరులో ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందని సంబంధిత వర్గాల అంచనా.

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 46 చేనేత సహకార సంఘాలుండేవి. విభజన అనంతరం ప్రస్తుతం 18 సంఘాలు ఉన్నాయి. వాటిలో దాదాపు 2,896 మంది సభ్యులున్నారు. సభ్యత్వం లేనివారు 704 మంది. అదేవిధంగా చేనేత అనుబంధ వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారు 1500 మంది వరకు ఉన్నారు. మొత్తంమీద జిల్లాలో 5144 మంది చేనేత వర్గానికి చెందిన వారున్నట్లు చేనేత, జౌళిశాఖ అధికారుల అంచనా. జిల్లాలో పాటూరు, గుమ్మలదిబ్బ, వింజమూరు, సంగం, ఏఎస్‌పేట, నారాయణరెడ్డిపేట, పొదలకూరు, మను బోలు, వెంకటాచలం ప్రాంతాల్లో చేనేత వర్గాలు ఎక్కువగా ఉన్నాయి. ఎక్కువ మంది మాస్టర్ వీవర్ల వద్ద మగ్గాల షెడ్లలో నేత నేస్తున్నారు. మరికొంత మంది కూలి పనులకు వెళుతున్నారు. ముడి సరుకు, నూలు ధరలు పెరగడంతోపాటు తయారు చేసిన వస్త్రాలను సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో అప్పులకు వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నట్లు చేనేత సంఘాల నాయకులు చెబుతున్నారు.


చీర నేస్తున్న మహిళ

● 30 మందితోనే సహకార సంఘం

చేనేత సహకార సంఘంలో కనీసం 100 మంది, అంతకంటే ఎక్కువ మంది సభ్యత్వం కలిగి ఉండేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య 70కి చేరింది. వైసీపీ హయాంలో చేనేతల పరిస్థితి మరింత దిగజారింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఒక సంఘంలో కనీసం 30 మంది సభ్యులు ఉండేలా దిశానిర్దేశం చేసింది. ప్రతిఒక్కరు సభ్యత్వం కలిగి ఉండాలని, అదేవిధంగా ప్రభుత్వ ఫలాలు అందరికీ అందాలనేది ముఖ్య ఉద్దేశం. దీంతో సంఘాల సంఖ్య పెరగడంతోపాటు వారికి ప్రభుత్వ రాయితీలు, రుణాలు సకాలంలో అందించేలా ప్రణాళికలు రూపొందించి ఆదిశగా చర్యలు తీసుకుంటోంది. అధ్యక్ష, కార్యదర్శులు, 7మంది సభ్యులతో సంఘం ఏర్పాటవుతుంది. గత తెలుగుదేశం పార్టీ హయాంలో చేనేతలకు అందిన ప్రభుత్వ పథకాలు, ఆప్కో వ్యవస్థ పునరుద్ధరణ, ఉచిత విద్యుత్, బీమా, కేంద్ర ప్రభుత్వ రాయితీలు వంటివి పొందే అవకాశం ఉంది.

సభ్యత్వం నమోదు చేసుకోవాలి



జిల్లాలో కొత్తగా చేనేత సహకార సంఘాల ఏర్పాటుకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. చేనేత రంగంలోని ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సంఘంలోని వారు సభ్యత్వం కోసం నమోదు చేసుకోవాలి. ఇప్పటి వరకు సభ్యత్వం లేనివారు కొత్త సంఘాల్లో నమోదు చేసుకునేందుకు చేనేత, జౌళిశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలి. కొత్త సంఘాల ఏర్పాటుకు కనీస సభ్యుల సంఖ్య 30 మందిగా ప్రభుత్వం నిర్ణయించింది. డిసెంబరులో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. పూర్తి వివరాలకు 9393229463, 94907 88502 నెంబర్లను సంప్రదించండి.

- వరప్రసాద్, చేనేత, జౌళిశాఖ ఏడీ

నగదు చెల్లింపులు జరిగితే రంగం అభివృద్ధి



చేనేత సహకార సంఘాలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం తిరిగి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి బలోపేతం చేసేందుకు కృషి చేయడం శుభపరిణామం. ఈ అవకాశాన్ని చేనేతలు సద్వినియోగం చేసుకోవాలి. సభ్యత్వం నమోదు చేసుకోవాలి. అయితే సేకరించిన వస్త్రాలకు సంబంధించి ప్రభుత్వం ఎప్పటికప్పుడు నగదు చెల్లింపులు చేస్తే చేనేత రంగం అభివృద్ధి చెందుతుంది.

- బుధవరపు బాలాజీ, చేనేత ఐక్యకార్యాచరణ కమిటీ అధ్యక్షుడు

రాజరాజేశ్వరి ఆలయంలో హుండీ లెక్కింపు

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 17: నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో మంగళవారం హుండీ లెక్కింపు జరిగింది. భక్తులు మే 21నుంచి సెప్టెంబరు 15వరకు వేసిన కానుకలను లెక్కించగా రూ.36లక్షల 2వేల 154 వచ్చింది. అన్నదాన విరా ళాలు రూ.80,238 వచ్చాయి. బంగారం 850గ్రాములు, వెండి 855గ్రాములు, విదేశీ కరెన్సీలో సౌదీరూయా 500 నోటు, 20నోటు, 200నోట్లు రెండు, వంద రూపాయిల నోట్లు 23, సింగపూర్ డాలర్ ఒకటి ఉన్నాయని ఆలయ ఈవో, సహాయ కమిషనర్ డీ వెంకటసు బ్బయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి పర్యవేక్షణాధికారిగా నరవాడ ఈవో వీ ఉషా, వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరాం వ్యవహరించారు.

పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడిగా బాలాజీ


పద్మశాలి సంఘం సమావేశంలో నాయకులు

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 17 : అఖిల భారత పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడిగా బుధవరపు బాలాజీని ఎన్నుకున్నారు. మంగళవారం నెల్లూరులోని ఓ ఆసు పత్రి ప్రాంగణంలో సంఘం సమావేశం జరిగింది. సంఘం అభివృద్ధితోపాటు జిల్లాలోని పద్మశాలి కుటుంబాల సభ్యత్వ నమోదుపై చర్చించారు. మండలాల వారీగా ఇన్‌చార్జు లను నియమించి బాధ్యతలు అప్పగించినట్లు బాలాజీ తెలిపారు. ఈ సమావేశంలో అఖి ల భారత చేనేత విభాగ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ బూదాటి రాధయ్య, సభ్యు లు డాక్టర్ మారం సుధాకర్, జిన్నాదుల వేణుగోపాలయ్య, ఆకురాతి శ్రీనివాసులు, కందుల మురళి, వెంకట రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలాల లీజుకు ఆహ్వానం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 17: ఆర్టీసీ నెల్లూరు రీజయన్ పరిధిలోని బుచ్చిరెడ్డిపాలెం, ఆత్మకూరు బస్టాండు పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను వ్యాపారం నిమిత్తం లీజుకు ఇచ్చేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ప్రజా రవాణా అధికారి జీ విజయరత్నం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరు-1వ డిపో పరిధిలోని బుచ్చిరెడ్డిపాలెం బస్ స్టేషన్‌లో 355.5 చదరపు గజాల స్థలం, ఆత్మకూరు బస్‌స్టేషన్‌లోని బిట్-2 5450 చదరపు అడుగుల స్థలం లీజుకు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 30వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోపు నెల్లూరు జోన్ ఈడీ కార్యాల యంలోని టెండర్ బాక్స్‌లో టెండర్లు వేయాలని, 3 గంటలకు దరఖాస్తుదారుల సమక్షంలో టెండర్లు తెరుస్తారని వివరించారు. ఈ టెండర్లపై ఈ నెల 19వ తేదీ ఉదయం 11 గంటలకు నెల్లూరు ఆర్టీసీ ప్రధాన బస్టాండులో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పీహెచ్‌సీల వైద్యుల 'చలో విజయవాడ'

- డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిరసన


డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వైద్యులు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 17 : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టారు. దీనికి ముందుగా మంగళ వారం ఉదయం ఏపీ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్యులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అసోసి యేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్ విజయవాడలో చేపట్టిన ఆందోళన శిబిరంలో పాల్గొన్నారు. మిగిలిన అసోసియేషన్ నేతలు డీఎంహెచ్‌వో కార్యాలయం వద్ద నిరసన తెలియచేస్తూ జీవో నెంబర్ 85ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పీజీ కౌన్సెలింగ్‌లో గతంలో 30 శాతం మార్కులు వేసే విధానం ఉండేదని, అది ఈ జీవో వల్ల 15 శాతానికి చేరిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ జీవోను రద్దు చేసి గతంలో లాగానే పీజీ కౌన్సెలింగ్ చేపట్టా లని కోరారు. టైంబౌండ్ ప్రమోషన్లలో ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి డిప్యూటీ సివిల్ సర్జన్లుగా, 12 ఏళ్ల పూర్తి చేసుకున్న వారికి సివిల్ సర్జన్‌గా ఉద్యోగో న్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇతర అలవెన్స్‌లు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నేతలు డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి, డాక్టర్ ధర్మేంద్ర, డాక్టర్ అహ్మద్‌బాబు, డాక్టర్ బాలచంద్రబాబు, డాక్టర్ శాంతి, డాక్టర్ రమాకుమారి, డాక్టర్ భానుప్రియ తదితరులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై మృతదేహం

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 17: నెల్లూరు సౌత్ రైల్వే స్టేషన్ సమీపంలో మంగళ వారం రైలు పట్టాలపై ఓ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారమి చ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. 50 నుంచి 55 ఏళ్లలోపు వయసు కలిగి ఉండి, నలుపురంగుపై బులుగు రంగు గళ్లు కలిగిన ఫుల్‌హ్యాండ్స్ షర్టు, గ్రే కలర్ ప్యాంటు ఉన్నాయి. వివరాలు పూర్తిగా తెలియక పోవడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

బాలిక ఆచూకీ లభ్యం

సంగం, సెప్టెంబరు 17: స్థానిక చెక్‌పోస్టు సెంటర్‌లో అదృశ్యమైన బాలిక ఆచూకీ లభ్యమయింది. బాలిక స్థానిక కాలేజీలో ఇంటర్ చదువుతోంది. కళాశాలకు వెళ్లకపోవడంతో తల్లి మందలించడంతో సోమవారం కాలేజీకి అని చెప్పి వెళ్లింది. తిరిగి ఇంటికి రాలేదు. స్నేహితులను విచారించిన కుటుంబ సభ్యులు ఆచూకీ లభ్యం కాకపోవడంతో మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో బాలిక నెల్లూరులోని బంధువుల ఇంట్లో ఉన్నట్లు తెలిసింది. దీంతో బాలికను తీసుకొచ్చేందుకు పోలీసులతో కలిసి తల్లిదండ్రులు వెళ్లారు.

యువకుడిపై కత్తితో దాడి

సంగం, సెప్టెంబరు 17: మండలంలోని జెండాదిబ్బలో మంగళవారం కృష్ణ అనే యువకుడిపై అదే గ్రామానికి చెందిన వెంగటయ్య అనే యువకుడు కత్తితో దాడి చేసి గాయపరిచాడు. పోలీసుల కథనం మేరకు కృష్ణ, వెంగటయ్య మధ్య ఓ మహిళ విషయపై మనస్పర్థలున్నాయి. వాటిలో దృష్టిలో పెట్టుకుని వెంగటయ్య కృష్ణపై కత్తితో దాడి చేశాడు. సమాచా రం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి గాయాలైన కృష్ణను వైద్యశాలకు తరలించారు. వెంగటయ్య పరారీలో ఉన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోనలో హుండీ ఆదాయం రూ.1,22,52,342

రాపూరు, సెప్టెంబరు 17: మండలంలోని పెంచల కోన ఆలయంలో మంగళవారం ఆలయ అధికారుల ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు. 90 రోజులకు హుండీ ద్వారా రూ. 1,22,52,342 నగదుతో పాటు 375 గ్రాముల బంగారు, కేజీ వెండి ఆభరణాలు, విదేశీ నగదు వచ్చింది. స్వామివారి నిత్యాన్న దానం వద్ద గల హుండీ ద్వారా రూ. 5,89,891 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు లెక్కింపును దేవదాయశాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు పర్యవేక్షించారు. కాగా పవిత్రోత్సవాల సందర్భంగా మంగళ వారం ఉదయం స్వామి,అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి దివ్యప్రబంధ పారాయణం, విశేషహోమం, తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు.


హుండీని లెక్కిస్తున్న ఆలయ అధికారులు

విద్యాసంస్థల్లో డీవార్మింగ్

- నులిపురుగుల నివారణ మందుల పంపిణీ


విద్యార్థినికి నులిపురుగుల మాత్ర వేస్తున్న డీఈవో రామారావు

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 17 : జాతీయ నులిపురుగుల నివారణ వారోత్సవాల్లో భాగంగా అన్ని విద్యాసంస్థల్లో మంగళవారం డీవార్మింగ్ కార్యక్రమం జరిగింది. విద్యార్థుల్లో నులిపురుగుల నిర్మూలనకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. నగరంలోని సుంకుచెంగన్న నగరపాలక ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డీఈవో రామారావు మాట్లాడుతూ పిల్లలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటేనే పరిపూర్ణ విద్యావంతులుగా మారుతారన్నారు. ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దామని, దీనికోసంగా ప్రతి విద్యార్థి మాత్రలు వేసుకోవాలని సూచించారు. డీఎంహెచ్‌వో డాక్టర్ పెంచలయ్య మాట్లాడుతూ ప్రతి చిన్నారి వ్యక్తగత పరిశుభ్రత పాటించాలన్నారు. గోళ్లు కత్తిరించుకోవాలని, బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయరాదని. మల విసర్జన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. జిల్లాలో 5,42,684 మంది పిల్లలకుగాను 5,13,921 మందికి మాత్రలు వేశామన్నారు. 94.71 శాతం డీవార్మింగ్ జరిగిందని, మిగిలిన వారికి ఈ నెల 25వ తేదీ వరకు మాత్రలు వేస్తామని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి, విద్యా, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. కొండాయపాళెం నగరపాలక ప్రాథమిక పాఠశాల, కేపీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కూడా డీవార్మింగ్ కార్యక్రమాలు జరిగాయి. వైద్యాధికారులు కే ఐశ్వర్య రాజ్యలక్ష్మి, ముజిబుల్ సుల్తానా, వేణుగోపాల్, హెచ్‌ఎం భాస్కర్‌రావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వేణు, ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ పీవో చెంచయ్య, రవికృష్ణ, లైబ్రరీ అధ్యాప కుడు బసిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● నెల్లూరు రూరల్ : వ్యాధి నిరోధక శక్తిని పెంచడంతోపాటు, జీర్ణవ్యవస్థను మెరుగుపరిచేందుకు దోహదపడే నులిపురుగుల మాత్రలను మంగళ వారం నెల్లూరు రూరల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో విద్యార్థులందరితో మాత్రలు మింగించారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

డీఎస్పీ శ్రీధర్ బాధ్యతల స్వీకరణ

కావలి, సెప్టెంబరు 17: కావలి డీఎస్పీగా శ్రీధర్ మంగళవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఎస్పీగా ఉన్న ఎం. వెంకటరమణను బదిలీ చేయటంతో ఆయన స్థానంలో శ్రీధర్‌ను నియమించారు. 1990 బ్యాచ్‌కు చెందిన శ్రీధర్ గతంలో నెల్లూరు మహిళా పోలీస్‌స్టేషన్‌లో సీసీఎస్‌లో పనిచేశారు. ప్రస్తుతం రాయచోటిలో పనిచేస్తూ ఇక్కడికి వచ్చారు.

15వ ఆర్థిక సంఘం నిధులు సర్పంచుల ఖాతాలకు జమ

లింగసముద్రం, సెప్టెంబరు 17: 2023-24 ఆర్థిక సంవత్సరంలో మండలానికి మంజూరైన 15వ ఆర్థిక సంఘం రెండోవిడత నిధులు 16 గ్రామ పంచాయతీల సర్పంచుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్టు ఈఓపీఆర్డీ రామసుబ్బారావు మంగళవారం తెలిపారు. టైడ్ నిధులు, రూ.48.23లక్షలు, అన్‌టైడ్ నిధులు రూ.32.19 లక్షలు మంజూరైనట్లు చెప్పారు. ఈ నిధులతో పంచాయతీల్లో అభివృద్ధి పనులు చేపడతామన్నారు.

కాలువకు మరమ్మతులు చేయండి

కొండాపురం, సెప్టెంబరు 17: మోపాడు రిజర్వాయరు కాలువకు మరమ్మతులు చేపట్టి దిగువ ఆయకట్టుకు నీరందేలా కృషి చేయాలని ఇరిగేషన్ ఈఈ నాగమురళి సాగునీటి సంఘ మాజీ అధ్యక్షుడు పోలినేని రమేష్ కోరారు. కాలువ పరిస్థితులను ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఆదేశాలతో మంగళవారం ఒంగోలు కార్యాలయానికి వెళ్లి ఈఈ నాగమురళికి వినతిపత్రం అందజేశారు. కాలువ దిగువన ఉన్న బ్రిడ్జిలు, తూములతో పాటు పూడికను తీయించి నీరు సక్రమంగా చివరివరకు అందేటట్లు చూడాలని కోరారు. స్పందించిన ఆయన వీలైనంత త్వరలో కాలువ పరిరక్షణకు చర్యలు తీసకుంటామన్నారు. ఆయన వెంట దగడ మాలకొం డారెడ్డి, మన్నెం మాల కొండయ్య తదితరులు ఉన్నారు.

దాడిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు

కావలి, సెప్టెంబరు 17: కొండాపురం మండలం నేకునాంపేటకు చెందిన నలగట్ల రుక్మిణమ్మపై పాత కక్షలతో గ్రామానికి చెందిన నలగట్ల పావని, కోటమ్మ, రొడ్డా శివశంకర్‌లు ఈ నెల 2వ తేదీన దాడిచేసి గాయపరిచినట్లు బాధితురాలు మంగళవారం కావలి జర్నలిస్ట్‌క్లబ్‌లో విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దాడి విషయాన్ని కొండాపురం పోలీస్‌స్టేషన్, కావలి డీఎస్పీ, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకునే వారు లేరన్నారు.

పోలేరమ్మ చెట్టు హుండీ ధ్వంసం

అల్లూరు, సెప్టెంబరు 17: స్థానిక బీసీ కాలనీ సమీపంలో వెలసిన పోలేరమ్మ చెట్టు వద్ద ఏర్పాటు చేసిన హుండీని మంగళవారం వేకువజామున గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. హుండీని గడ్డపారతో పగులగొడుతుండగా సమీపంలోని గృహాల్లో నిద్రిస్తున్న వ్యక్తులకు భారీగా శబ్దం వినపడడంతో హుటాహుటిన ఘటనా స్థలానికి వచ్చారు. గ్రామస్థులను వీరు చూసి గడ్డపారను అక్కడే వదిలేసి పారిపోయారు. ఈ విషయంపై అల్లూరు పోలీస్‌స్టేషనులో ఫిర్యాదు చేయగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

20న జాబ్‌మేళా

ఆత్మకూరు, సెప్టెంబరు 17: స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 20న ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఎంప్లాయిమెంట్ కార్యాలయాల ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ వినీల్ కుమార్, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ వినయ్‌కుమార్, సీడాప్ జేడీఎం హైమవతి, కలాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. జాబ్‌మేళాకు కెఎల్ గ్రూప్, అమెజాన్, క్రెడిట్ అసిస్ గ్రామీన్ లిమిటెడ్, గ్రీన్‌టెక్, అమర్‌జాజా బ్యాటరీస్ తదితర కంపెనీలు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4వరకు జాబ్‌మేళా జరుగుతుందని, యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి స్కూల్ గేమ్స్ జట్ల ఎంపిక

ఏఎస్‌పేట, సెప్టెంబరు 17: స్థానిక జడ్పీహైస్కూల్, కావలియడవల్లి హైస్కూల్‌లో బుధ, గురువారాల్లో స్కూల్ గేమ్ ఫెడరేషన్ పోటీలకు జట్లను ఎంపిక చేయనున్నట్లు మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ మల్లెవాసు తెలిపారు. అండర్ 14,17 బాలబాలికలకు అథ్లెటిక్స్, యోగా, చెస్ పోటీల జట్లను బుధవారం, కబడ్డీ,ఖోఖో వాలీబాల్,షటిల్, బ్యాడ్మింటన్ జట్లను గురువారం ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

వీధిలైట్ల ఏర్పాటు

సీతారామపురం, సెప్టెంబరు 17: మండల పరిధిలోని పబ్బులేటిపల్లిలో సర్పంచి మద్దినేని ఆదినారాయణ ఆధ్వర్యంలో మంగళవారం వీధిలైట్లను ఏర్పాటు చేశారు. నీటి సమస్య తీర్చేందుకు బోర్లు వేయించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యదర్శి పిడుగు రవీంద్ర, ఇంజనీర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

హద్దురాళ్లు పగలకొట్టారని ఫిర్యాదు

సంగం, సెప్టెంబరు 17: తరుణవాయిలో గంటా పద్మమ్మకు చెందిన పొలం హద్దు రాళ్లను గుర్తు తెలియని వ్యక్తులు పగల కొట్టారని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

న్యాయం చేయాలని వినతి

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 17: తమకు న్యాయం చేయాలని కుర్రపల్లికి పలువురు లబ్ధిదారులు మంగళవారం తహసీల్దారు సుభద్రను కలిసి వినతిపత్రం అందజేశారు. సర్వేనెంబర్ 94/2లో 13.64 ఎకరాలను మాదిగమాన్యం కింద కొన్నేళ్ల క్రితం మంజూరు చేసింది. అప్పట్లో గుడిపాటి యర్ర వెంకటయ్య పేరు పట్టా మంజూరు చేశారన్నారు. అయితే అప్పటి నుంచి లబ్ధిదారులంతా కలిసి ఆ భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ఆయన చనిపోవడంతో కుటుంబీకులు భూమి తమదంటూ దౌర్జన్యం చేస్తున్నారన్నారు. పూర్తిస్థాయి విచారణ చేసి ఆ భూమిలో హక్కుదారులైన తమ పేర్లను రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసి న్యాయం జరిగేలా చేయాలని కోరారు.

త్వరలో నగర పంచాయతీలు గ్రామ పంచాయతీలుగా మార్పు

● ఇస్కపల్లి-రాజుపాలెం రోడ్డుకు మోక్షం ● ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

అల్లూరు, సెప్టెంబరు 17: కూటమి ప్రభుత్వం హయాంలో గ్రామాలన్నీ బాగుపడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని ఆ దిశగా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందని, అలాగే నగర పంచాయతీలను గ్రామ పంచాయతీలుగా మార్పు చేయనున్నట్లు అతిత్వరలోనే ఈ కార్యక్రమం చేపట్టనుందని ఉందని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్‌తో కలిసి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ముందుగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహసీల్దారు, ఎస్ఐల పరిచయ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతీ పంచాయతీలోని రోడ్లు, డ్రెయినేజీలకు రూ.5కోట్లు నిధులు మంజూరైనట్లు త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా తాగునీటి పథకానికి రూ.78లక్షలు నిధులు విడుదల అవుతాయన్నారు. ఈ నిధులతో ఇస్కపల్లి-రాజుపాలెం రోడ్డు నిర్మాణానికి అడుగులు పడతాయన్నారు. అలాగే తీరప్రాంత గ్రామాలు రామాయపట్నం, జువ్వలదిన్నె హార్బర్లను కలుపుతూ జాతీయ రహదారి నిర్మాణానికి ఇప్పటికే సర్వే చేపటామన్నారు. ఇదే జరిగితే తీరప్రాంత గ్రామాలు అభివృద్ధి అయ్యే అవకాశం ఉందన్నారు. కేంద్రంతో చర్చలు జరిపి నిధులు తెచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు అహర్నిశలు కృషి చేస్తూనే ఉన్నారన్నారు. అనంతరం పోలేరమ్మ ఆలయం గణపతి విగ్రహ నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బండి అమర్‌రెడ్డి, నెల్లూరు నిరంజన్‌రెడ్డి, కృష్ణచైతన్య, బండి శ్రీనివాసులు రెడ్డి, నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, మేడా శ్రీనివాసులు రెడ్డి, మేడా రామకృష్ణరెడ్డి, రుద్రయ్య, ప్రభాకర్, కరుణాకర్, రాజేంద్ర పాల్గొన్నారు.

ఘనంగా మోదీ జన్మదినం, విశ్వకర్మ జయంతి

కందుకూరు, సెప్టెంబరు 17: బీజేపీ నియోజకవర్గ నేతలు మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం, విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మోదీ సంపూర్ణ ఆయురారోగ్యాలతో దేశాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని గ్రామ దేవత అంకమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం కనిగిరి రోడ్డులోని టింబర్ డిపోల వద్ద విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో బీజేపీ నియోజకవర్గ సమన్వయకర్త గట్టమనేని హరిబాబు, పార్టీ నాయకులు మన్నేపల్లి వరప్రసాదరావు, జగన్నాథం, వైకుంఠం, చుండి మురళీధర్, అమలనాథుని మాల్యాద్రినాయుడు, బొర్రా కోటేశ్వరరావు, ముప్పల భూషయ్య, భాస్కరరావు పాల్గొన్నారు.

ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బ్రేక్ ఇన్‌స్పెక్టర్ రాములు మాట్లాడుతూ విశ్వకర్మను ప్రపంచంలో మొదటి ఇంజనీర్, ఆర్కిటెక్ట్‌గా పరిగణిస్తారన్నారు.

జలదంకి: ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డె శ్రీనాథ్‌రెడ్డి జలదంకిలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 26మంది యువకులు రక్తదానం చేయగా కావలి రెడ్‌క్రాస్ సిబ్బంది రక్తాన్ని సేకరించారు. రక్తదానం చేసిన యువకులకు మోదీ జ్ఞాపికలు అంద జేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు మధురెడ్డి, చిన్నా, తిరుపతి రెడ్డి, రాకేష్‌రెడ్డి, హనుమారెడ్డి పాల్గొన్నారు.



కావలి: ఏరియా వైద్యశాలలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకల్లో బీజేపీ నేతలు



ఆత్మకూరు: విశ్వకర్మకు నివాళులర్పిస్తున్న బ్రేక్ ఇన్‌స్పెక్టర్ రాములు

కావలి టౌన్: బీజేపీ నాయకులు ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుండ్లపల్లి భరత్‌కుమార్, కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు కంచర్ల మురళీకృష్ణ నాయుడు, బ్రహ్మానందం, కమల, పరుసు వెంకటేశ్వర్లు, మాల్యాద్రి పాల్గొన్నారు.

పరిశుభ్రత భారత్‌గా మార్చడమే లక్ష్యం

● ఊరూరా స్వచ్ఛత హి సేవ ర్యాలీలు

కందుకూరు, సెప్టెంబరు 17: పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించటం, దేశాన్ని పరిశుభ్రత భారత్‌గా తీర్చిదిద్దడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టరు శ్రీపూజ అన్నారు. అందులో భాగంగా మంగళవారం సాయంత్రం కందుకూరులో నిర్వహించిన ర్యాలీలో వారు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధానవీధుల్లో ర్యాలీ నిర్వహించి ఎన్టీఆర్ విగ్రహం సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. మున్సిపల్ కమిషనర్ అనూష ప్రజలతో స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేయించారు. రానున్న వర్షాలకాలం సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా అన్ని పంచాయతీల్లో తక్షణంఆర్థిక సంఘం నిధులు వినియోగించి పారిశుద్య చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, చిలకపాటి మధు, షేక్ రఫీ, బెజవాడ ప్రసాదు, చదలవాడ కొండయ్య, వడ్లెళ్ల రవిచంద్ర పాల్గొన్నారు.

లింగసముద్రం: ఎంపీడీఓ శ్రీనివాసులు స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్ నుంచి ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధశాఖల అధికారులు, సిబ్బంది స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి బస్టాండ్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ పులి రాఘవులు, మాజీ సర్పంచ్ కిలారి కొండయ్య, తహసీల్దార్ సీతామహాలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ శివకుమార్, ఈఓపీఆర్డీ రామసుబ్బారావు, ఏపీఓ షేక్ సమీర్‌బాషా, సూపర్‌వైజర్ రాధాదేవి పాల్గొన్నారు.

బిట్రగుంట: ఎంపీడీవో వెంకటసుబ్బారావు మేజర్ పంచాయతీలో విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, కార్మికులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ, ఆశావర్కర్లతో ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి సర్పంచు అనిత, మండల కన్వీనర్ నాగేశ్వరావు, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, టీడీపీ మండలాధ్యక్షురాలు అరుణమ్మ, హెచ్ఎం గంగాధర్‌రావు, జహీర్ బాషా, సామాజికకర్త ప్రభాకర్ ఉన్నారు.

కలిగిరి: పట్టణ హైస్కూల్ విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు, ఎంఈఓ సురేష్, కార్యదర్శి చెంచుక్రిష్ణయ్య, సర్పంచు వెంకటసుబ్బయ్య, యల్లకర సతీష్ పాల్గొన్నారు. నాగసముద్రంలో గ్రామస్థులతో నిర్వహించిన ర్యాలీలో మండల విస్తరణాధికారి వెలుగోటి మధు, సర్పంచ్ డేగ శ్రీనివాసులు, మాజీ ఎంపీటీసీ అంబటి శంకరయ్య, నరసాల మాల్యాద్రి, భాపతి మాలకొండయ్య, యర్రగుంట రాజశేఖర్ పాల్గొన్నారు.

కావలి రూరల్: ఎంపీడీవో శ్రీధర్ బాబు మండల కార్యాలయంలో అధికారులు, ప్రజాప్రతినిధులతో అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం నుంచి బ్రిడ్జి సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ ఆలూరి కొండ మ్మ, ఎంఈవో వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

అల్లూరు: ఎంపీపీ దర్శిగుంట శశిరేఖ ఆధ్వర్యం లో మండల కార్యాలయం నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ పెంచల వీరేంద్ర, నగర పంచాయతీ కమి షనరు ఫణికుమార్, వరప్రసాద్ పాల్గొన్నారు.

కొండాపురం: ఎంపీడీవో ఎమ్.బ్రహ్మయ్య మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించి బస్టాండు కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ నారాయణ, గుడవళ్లూరు కార్యదర్శి ప్రదీప్, బీజేపీ మండల అధ్యక్షుడు మాలేపాటి మల్లికార్జు, ఉపసర్పంచ్ మణి పాల్గొన్నారు.

ఉలవపాడు: మండలకేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయ, ఎంఈఓ శివనాగేశ్వరరావు, సీడీపీఓ అరుణ సర్పంచ్ విజయమ్మ, రాచగల్లు సుబ్బారావు, సుదర్శి శ్రీను, అంచుపోగు వాసు, రమేష్ పాల్గొన్నారు.

ఆత్మకూరు : మహిమలూరులో ర్యాలీ నిర్వహించారు. పరిసరాల పరిశుభ్రతపై నినాదాలు చేశారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్, సర్పంచి, ఎంపీటీసీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీతారామపురం: జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలిసి ఎంఈవో మస్తాన్‌వలి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, వెంగయ్య, ప్రసాద్, కార్యదర్శి జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కందుకూరు: ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఇంటూరి, సబ్ కలెక్టరు శ్రీపూజ



కావలి రూరల్: ర్యాలీ నిర్వహిస్తున్న ఎంపీడీవో శ్రీధర్‌బాబు, తదితరులు

వరికుంటపాడు: ఎంపీడీవో మల్లికార్జున ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం చేపట్టి నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : దుత్తలూరులో అధికారులు, నాయకులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా మానవహారం ఏర్పాటు చేసి నినాదాలు చేపట్టారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సంధ్యాలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి నజీముల్లా ఉన్నారు.

ఉదయగిరి రూరల్: ఉదయగిరిలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో టీడీపీ నాయకులు, విద్యార్థులు కలిసి స్థానిక రంగనాయకుల ఆలయం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ , ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి, ఎంఈవో శ్రీనివాసులు, ఏతలు రవీంద్రనాథ్, శ్రీనివాస రాజు, బయ్యన్న, నరసింహులు, సందానీ పాల్గొన్నారు.

కలువాయి: అన్నీ పంచాయతీలో ర్యాలీలు, మానవహారం, ప్రతిజ్ఞలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గోవర్ధన్ పాల్గొన్నారు.

ఏఎస్‌పేట: ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం సతీష్, ఏఎస్‌వో రాజేంద్ర విశ్వనాథ్, పంచాయతీ కార్యదర్శులు గ్రా మ పెద్దలు పాల్గొన్నారు.



ఆత్మకూరు : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



ఉదయగిరి: ర్యాలీ పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

రక్తదానం సామాజిక బాధ్యతగా తీసుకోవాలి

కందుకూరు, సెప్టెంబరు 17: యువత రక్తదానంను సామాజిక బాధ్యతగా తీసుకుని ప్రజల ప్రాణాలను కాపాడటంలో క్రియాశీలంగా వ్యవహరించాలని కందుకూరు సీఐ వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక రక్తదాతల గ్రూపు 8వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి కందుకూరులో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా సీఐ పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టంగుటూరు మాజీ సర్పంచ్ బెల్లం జయంత్‌బాబు, చెన్నా రామాంజనేయులు, మంగళగిరి నరసింహారావు, కానిస్టేబుల్ పూరిపత్తి శ్రీనివాసరావు ఉన్నారు.

పీఎంఏవై లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ

కలువాయి, సెప్టెంబరు 17 : ప్రధానమంత్రి ఆవాస యోజన (పీఎంఏవై) 2.0 కింద మంజూరైన పక్కాఇళ్ల లబ్ధిదారులకు మంగళవారం గృహనిర్మాణశాఖ అధికారులు, నాయకులు కలసి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. కలువాయిలో 18, నూకనపల్లిలో 3కలిపి మొత్తం 21మందికి ఇళ్లు మంజూరయ్యాయి. వీరందరికి ఇంటి వద్దే మంజూరు పత్రాలు అందజేశారు. అలాగే (పీఎంఏవై) 1.0 కింద నిర్మాణం పూర్తియిన ఇళ్లలో గృహప్రవేశాలు చేశారు. చిన్నగోపవరం, బద్వేలు, బ్రాహ్మణపల్లిలో గృహప్రవేశాలు జరిగాయి. ఎంపీడీవో గోవర్ధన్, ఎంఈవో-2 శేషగిరిరావు, వెంకటేశ్వర్లు నాయడు, చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిషోర్‌రెడ్డి, జగదల్ నాయుడు పాల్గొన్నారు.

ఆలయానికి స్థలం కేటాయించాలి

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 17: ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని మంగళ వారం బీజేపీ మండల అధ్యక్షుడు చుండి హరిగోపాల్‌రెడ్డి ఆధ్వ ర్యంలో నాయకులు తహసీల్దారు నాగరాజుకు వినతిపత్రం అందజే శారు. అనంతరం వారు మాట్లాడుతూ హైవే నిర్మాణంలో దుత్తలూ రు సెంటర్‌లో ఉన్న ఆంజనేయస్వామి ఆలయాన్ని తొలగించారన్నా రు. ఆలయ నిర్మాణానికి సెంటర్‌లో స్థలాన్ని కేటా యించాలన్నారు.

ప్రభుత్వాధినేతల చిత్రపటాల బహూకరణ

చేజర్ల, సెప్టెంబరు17 : మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలకు మంగళవారం టీడీపీ నాయకులు ఉడతా హజరత్తయ్య ప్రభుత్వాధినేతల చిత్రపటాలను అందజేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి ఆనం రామనా రాయణరెడ్డి చిత్ర పటాలను ఆయా శాఖల కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని అధికారులకు వాటిని అందజేశారు.

ఆరోగ్యవంతమైన సమాజమే ప్రభుత్వ లక్ష్యం

కలిగిరి, సెప్టెంబరు 17: ఆరోగ్యవంతమైన సమాజమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండటానికి ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు తెలిపారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల వేయించారు. కార్యక్రమంలో హైస్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

బిట్రగుంట: పీహెచ్ఎన్ మేరీ తాళ్లూరు పంచాయతీలోని ప్రాథమిక పాఠశాలలో నులిపురుగు నివారణ దినోత్సవంలో పాల్గొని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం వెంకటసుబ్రమణ్యం, హెల్త్ సూపర్‌వైజర్ విక్టోరియారాణి, ఎంఎల్‌హెచ్‌పీ శివ కుమార్, ఏఎన్ఎం రోజ్‌లిన్, ఆశావర్కలు పాల్గొన్నారు.

కందుకూరు: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని 19ఏళ్ల లోపు చిన్నారులందరికీ మున్సిపల్ కమిషనర్ కె.అనూష, పీహెచ్‌సీ వైద్యాధికారులు బ్యూలాగ్రేస్, స్టెల్లా కారుణ్యలు నులి పురుగుల నిర్మూలన మాత్రలు వేయించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ప్రియంవద పర్యవేక్షణలో ఈ కార్యక్రమం చేపట్టారు. నులిపురుగులతో కలిగే అనారోగ్యాలను వివరించారు. పీహెచ్ఎన్ ఇంటూరి పద్మావతి, శోభ పాల్గొన్నారు.

లింగసముద్రం: అన్ని పాఠశాలలు, హైస్కూళ్లలో ఏడాది నుండి 19ఏళ్లలోపు 6018 మంది పిల్లలల్లో 5773 మందికి నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేసినట్టు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీహెచ్ఓ శ్రీనివాసులు తెలిపారు. మిగిలిన చిన్నారులకు ఈ నెల 25న పంపిణీ చేస్తామన్నారు.



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కలిగిరి, సెప్టెంబరు 17: పట్టణంలోని మసీదువీధికి చెందిన బైక్ మెకానిక్ గిడే సాహెబ్ కుమారుడు ఆశిక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి మంగళవారం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో ఊసా మాల్యాద్రి, మేడం నరసింహారెడ్డి, చేరెడ్డి వెంకట సుబ్బారెడ్డి, సోము భాస్కర్, పేరం నాగిరెడ్డి, జిర్రా పెద అంకిరెడ్డి, ఇంగ్లేకల్లయ్య, హటేల్‌బాష, కొప్పోలు కొండలరావు, సురేష్ పాల్గొన్నారు.

ఏఎన్ఎంపై చర్య తీసుకోవాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

కావలి, సెప్టెంబరు 17: కోవూరుపల్లి ఏఎన్ఎం నిర్లక్ష్యంతో పాము కాటుకు గురైన శంకరయ్య మృతి చెందారని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి తెలిపారు. ఏఎన్ఎం నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ మంగళవారం కావలి ఆర్డీవో కార్యాలయం ఎదుట బాధిత కుటుంబ సభ్యులతో ఆయన నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీవో శీనానాయక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడారు. కోవూరుపల్లి బొచ్చు శంకరయ్య ఈ నె 2వ తేదీన పాముకాటుకు గురై వైద్యం కోసం పీహెచ్‌సీకి వెళితే అక్కడ విధుల్లో ఉన్న ఏఎన్ఎం ఒకటిన్నర గంటసేపు ఆస్పత్రి తలుపులు తీయకుండా నిర్లక్ష్యంగా వహించినట్లు మండిపడ్డారు. విషయంపై బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

గుడ్లూరు, సెప్టెంబరు 17: అనుమతులు లేకుండా మంగళవారం వేకువజామున దప్పళంపాడు మన్నేరు రేవు నుంచి అక్రమంగా ఇతర మండలాలకు ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గుడ్లూరు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పట్టుబడిన ట్రాక్టర్లను స్టే షన్‌ను తరలించారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకట్రావు తెలిపారు.

లింగసముద్రం: పెదపవని శివారులో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముందస్తు సమాచారంలో ఉదయం 6గంటల సమయంలో సిబ్బందితో దాడి చేసినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ సుభాని తెలిపారు. అనంతరం ట్రాక్టర్, డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కలువాయి: నూకనపల్లి సమీపంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సుమన్ తెలిపారు. తెలుగురాయపురం వీఆర్వో ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు. పెన్నానది పరిసర గ్రామాల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

ఓజోన్ పొర పరిరక్షణతోనే మానవ మనుగడ

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 17: ఓజోన్ పొర పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని ఇన్‌చార్జి హెచ్ఎం డీ రమేష్ పేర్కొన్నారు. మంగళవారం కృష్ణంపల్లి ఉన్నత పాఠశాలలో అప్‌కాస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఓజోన్ పొర పరిరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జరీనా, సుధాకర్, ముజఫర్‌అలీ, పంచాయతీ కార్యదర్శి శిల్పా, వెల్ఫేర్ అసిస్టెంట్ నరేంద్ర పాల్గొన్నారు.

కందుకూరు : స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓజోన్ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టరు ఎం.రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వాతావరణ సమతుల్యత దెబ్బతినకుండా మానవజీవితం ఆనందంగా సాగాలంటే ఓజోన్ పొరను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఉందని అందుకు చేయాల్సిన మానవ ప్రయత్నాలను వివరించారు. అవకాశం ఉన్న ప్రతిచోట మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించటం ద్వారా పర్యావరణాన్ని తద్వారా ఓజోన్ పొరకు కాపాడుకునేందుకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో అధ్యాపకులు కమల్‌బాబు, ఎన్వీ శ్రీహరి, ఎన్. తిరుపతిస్వామి, పద్మావతి, కరుణకుమార్, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మరో వంతెన నిర్మాణానికి పరిశీలన



దువ్వూరు కాలువను పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు

సంగం, సెప్టెంబరు 17: సంగం గ్రామం మధ్యలో వెళ్తున్న దువ్వూరు కాలువపై మరో వంతెన నిర్మాణానికి ఇరిగేషన్ అధికారులు డీఈ మధుసూదన్, ఏఈ వెంకట కృష్ణ మంగళవారం పరిశీలించారు. దువ్వూరు కాలువ సంగం మధ్యలో నుంచి వెళుతుంది. అయితే ప్రస్తుతం బస్టాండ్ సెంటర్, బండారుమిట్ట, దళితవాడ వద్ద మూడు చోట్ల దువ్వూరు కాలువపై వంతెనలు ఉన్నాయి. ఈ క్రమంలో సాయినగర్ నుంచి తూర్పువీధిని కలుపుతూ మరో వంతెన నిర్మిస్తే గ్రామస్థులతోపాటు రైతులకు ఉపయోగపడుతుంది. ఇందుకోసం అధికారులు ప్రతిపాదనలు పంపనున్నారు. కార్యక్రమంలో వారి వెంట టీడీపీ నాయకులు కాకు మధుసూదన్ యాదవ్ ఉన్నారు.

ఉర్దూ పాఠశాలలను బలోపేతం చేయాలి



ఆత్మకూరు : మాట్లాడుతున్న షేక్ ఖాజామొహిద్దీన్

ఆత్మకూరు, సెప్టెంబరు 17: ఉర్దూ పాఠశాలల సముదాయాల సమావేశాలను సద్వినియోగం చేసుకుని, సాంకేతిక విద్యలో బలోపేతం చేయాలని జిల్లా ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ ఖాజామొహిద్దీన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న ఉర్దూ పాఠశాలల సముదాయాల సమావేశాలను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో కాంప్లెక్ హెచ్ఎం అనంతలక్ష్మి, రిసోర్స్ పర్సన్స్ పాల్గొన్నారు.

ఉదయగిరి రూరల్ : జిల్లా డిప్యూటీ ఉర్దూ ఇన్‌స్పెక్టర్ షేక్ ఖాజామొహిద్దీన్, ఎంఈవో-2 శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గస్థాయి ఉర్దూ పాఠశాలల సముదాయ సమావేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అజెండా ప్రకారం సమావేశాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో సముదాయ సెక్రటరీ షఫీ అహ్మద్, రిసోర్సుపర్సన్‌లు షేక్ఎండీ కరీం, షేక్ షంషాద్‌బేగం, షేక్ ఇనాయత్ కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం

కావలి టౌన్, సెప్టెంబరు 17: స్థానిక వైకుంఠ పు రం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మంగళవారం ఏను గు వాహనంపై నిర్వహించిన గణేష్ విగ్రహ గ్రామోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వైకుంఠపురం నుం చి ముసునూరు మందాటి చెరువు వరకు ట్రంకు రోడ్డు పై ముందుకు సాగారు. అనంతరం విగ్రహాన్ని చెరువులో నిమజ్జనం చేశారు. మాజీ కౌన్సిలర్లు గుడ్లూరు మాల్యాద్రి, చినపుల్లయ్య, అభిసాగర్ పాల్గొన్నారు.

సంగం: సంగంలో మంగళవారం పలు చోట్ల ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనాలను నిర్వహించారు. శివాలయం సెంటర్, బెస్తపాళెం సెంటలో ఏర్పాటు చేసిన విగ్రహాలను పూలతో అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో యువకులు కేరింతలు కొడుతూ పాల్గొన్నారు. ఊరేగింపు అనంతరం నిమజ్జనం చేశారు.

కావలి: గజవాహనంపై గణేశ్ విగ్రహ గ్రామోత్సవం

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

రైతు ప్రయోజనాలే లక్ష్యంగా పని చేస్తా

● ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



వ్యవసాయ పనిముట్లను పరిశీలిస్తున్న సోమిరెడ్డి తదితరులు

పొదలకూరు, సెప్టెంబరు 17: రైతు ప్రయోజనాల కోసం రాజీ లేకుండా పని చేస్తానని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని ప్రభగిరిపట్నం వద్ద ఉన్న కిసాన్ క్రాఫ్ట్ పరిశ్రమను పరిశీలించి, పరిశ్రమలో తయారవుతున్న వ్యవసాయ పనిముట్ల గురించి తెలుసుకున్నారు. అనంతరం కిసాన్ క్రాఫ్ట్ ఛైర్మన్ రవీంద్రకుమార్ అగర్వాల్, వైస్ ప్రెసిడెంట్ పీఎస్ సింగ్, ఇంటర్నేషనల్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ నికోలస్ గ్రాబ్లెర్, సీఈవో చలసాని అజయ్‌కుమార్‌లు ఎమ్మెల్యే సోమిరెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో వ్యవసాయంతో పాటు ఇరిగేషన్ శాఖను ముంచేశారన్నారు. టీడీపీ కూటమి పాలనలో చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఏపీలో రైతులకు మళ్లీ మంచి రోజులొచ్చాయన్నారు. తాను వ్యవసాయశాఖ మంత్రిగా వ్యవసాయ పథకాల అమలులో ఆంధ్రప్రదేశ్‌ను జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలిపానన్నారు. తాను అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా పేదల ప్రయోజనాలతో పాటు రైతుల విషయంలో రాజీ పడనన్నారు. అనంతరం ప్రధాన మంత్రి ఆవాస్ యోజనలో భాగంగా మండలంలోని బిరదవోలులో నిర్మించిన పక్కా గృహాలను సోమిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తలచీరు మస్తాన్‌బాబు, బక్కయ్యనాయుడు, పుటిపాటి వెంకటరత్నం నాయుడు, కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, అక్కెం సుధాకర్‌రెడ్డి, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, జమీరు పాల్గొన్నారు.

హిందీభాషలో ప్రావీణ్యం సాధించాలి

● క్షేత్ర ప్రచార అధికారి నాగసాయి సూరి

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 17 : మాతృభాష తెలుగుతోపాటు ప్రతి ఒక్కరూ హిందీ భాషలో కూడా ప్రావీణ్యం సాధించాలని భారత ప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి పరవస్తు నాగసాయి సూరి పిలుపునిచ్చారు. నగరంలోని ప్రభుత్వ ఆదర్శ ఉన్నత పాఠశాలలో మంగళవారం హిందీ భాషా పక్షోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హిందీ భాష భారతీయులను సంఘటితంగా ఉంచుతుందని, దీని ద్వారా దేశంలో ఎక్కడైనా జీవనం సాగించవచ్చన్నారు. భవిష్యత్‌లో జాతీయస్థాయి ఉద్యోగాల్లో రాణించేందుకు హిందీ భాష దోహదం చేస్తుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా రేడియో ప్రోగ్రామ్ హెడ్ ఆవుల విజయభాస్కర్‌రెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ మాధవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులు, హిందీ ఉపాధ్యాయులు పవన్‌కుమార్, భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

విశిష్ట సేవలందించిన విశ్వబ్రాహ్మణులకు సన్మానం



విశిష్ట సేవలందించిన వక్తను సన్మానిస్తున్న వెంకటశేషయ్య ఆచారి

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 17 : విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని పలు రంగాల్లో విశిష్ట సేవలందించిన విశ్వబ్రాహ్మణులను మంగళవారం నగరంలో సన్మానించారు. జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఖాజన వెంకట శేషయ్య ఆచారి ఆధ్వర్యంలో ఆ సంఘం కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. తాళ్లపాక ఆనందయ్యస్వామి (వెంకయ్య స్వామి ఆశ్రమం, కొత్తూరు), గానుగపెంట వెంకటేశ్వర్లు ఆచారి(వాస్తు, జ్యోతిషం, సీతా రామపురం), కొండేపి గిరిజారావు(విశ్రాంత ఉపాధ్యాయుడు, నెల్లూరు)ను సత్కరించారు. ఈ సందర్భంగా విశ్వకర్మ పతాకావిష్కరణ, పూజా కార్యక్రమాలు జరిగాయి. కార్పొరేటర్లు వేలూరు మహేష్, జయలక్ష్మి, సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు బుడంగుంట జానకిరామయ్య ఆచారి, ప్రధాన కార్యదర్శి తల్లం సురేష్ ఆచారి, కోశాధికారి ఏలూరు బాబు ఆచారి, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఇలాపాక శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల ధర్నా

మనుబోలు, సెప్టెంబరు 17: ఉపాధి పనులు కల్పించాలని కోరుతూ ఉపాధి హామీ పథకం కూలీలు సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం చెర్లోపల్లి గ్రామ సచివాలయం ఎదుట ధర్నా చేశారు. సీపీఎం కార్యదర్శి తలారి దేవదానం మాట్లాడుతూ గ్రామంలో మూడు వారాలుగా పనులు లేక కూలీలు అల్లాడుతున్నారన్నారు. వ్యవసాయ పనులు లేక, ఉపాధి పనులు లేక కూలీల పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. 200మంది కూలీలు ఉంటే కేవలం పది, ఇరవై మందికి పనులు చూపితే మిగతాకూలీల గతేమిటన్నారు. ఇటీవల గ్రామసభల్లో పనులు కావాలని చెప్పినా, ఉపాధిసిబ్బంది స్పందించలేదన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం నాయకులు, కూలీలు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 20న జాబ్‌మేళా

కోవూరు, సెప్టెంబరు 17: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 20వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసూన తెలిపారు. కళాశాలలో మంగళ వారం ఆమె జిల్లా స్కిల్ డెవలప్‌మెంటు ఆఫీసరు వినీల్ కుమార్, సీడాప్ జేడీ హైమావతి తో కలిసి విలేకరులతో మాట్లాడా రు. ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల ప్రతినిధులు నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



వెంకటాచలం : వీఎస్‌యూలో మొక్కలు నాటుతున్న వీసీ విజయభాస్కర్‌రావు

వాడవాడలా 'స్వచ్ఛత హి సేవ'

● వీఎస్‌యూలో మొక్కలు నాటిన వీసీ

వెంకటాచలం, సెప్టెంబరు 17 : స్వచ్ఛత హి సేవ కార్యక్రమం మంగళవారం వాడవాడలా జరిగింది. వెంకటాచలం మండలం కాకుటూరు వద్ద ఉన్న విక్రమ సింహపురి యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో భాగంగా అమ్మపేరుతో ఒక్క మొక్క నాటే కార్యక్రమాన్ని చేపట్టి వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్‌రావు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విజయ, టీ వీరారెడ్డి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ అల్లం ఉదయ్ శంకర్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ కే ప్రభాకర్ రెడ్డి, డాక్టర్ బీవీ సుబ్బారెడ్డి, కోట సునీల్‌కుమార్, జెనెక్స్ కళాశాల కరస్పాండెంట్ వెంగల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోవూరు : పట్టణంలో అధికారులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛత హి సేవ ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ బజారుకూడలి మీదుగా మండల పరిషత్ కార్యాలయం వరకు సాగింది. కార్యక్రమంలో ఎంపీపీ తుమ్మలపెంట పార్వతి, తహసీల్దారు నిత్యానందబాబా, ఎంపీడీవో శ్రీహరి, బీజేపీ నేతు ఐనకోట రఘురామయ్య, టీడీపీ నేత నాటకరాని వెంకట్ పాల్గొన్నారు.

బుచ్చిరెడ్డిపాళెం : బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని పలు ప్రాంతాల్లో నగర పంచాయతీ కమిషనర్ ఎల్.చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమంపై సిబ్బందితో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా మండలంలోని మినగల్లు గ్రామంలో హైస్కూల్ విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్, సిబ్బది చీపుర్లుపట్టి రోడ్లు ఊడ్చి శుభ్రం చేశారు. అలాగే జొన్నవాడ ఆలయంలో ఆలయ ఈవో ఏవీ.శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది గర్భాలయ గోడలను శుభ్రం చేశారు.

విడవలూరు : విడవలూరులో అధికారులు, నాయకులు ఎంపీడీవో కార్యాలయం నుంచి అంకమ్మదేవాలయం సెంటర్ వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీడీవో శ్రీనివాసులు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెముకుల కృష్ణ చైతన్య, నాయకులు చెముకుల శ్రీనివాసులు, ఇమాంబాషా, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మనుబోలు : స్థానిక ఉన్నత పాఠశాల నుంచి వైఎస్ విగ్రహం వరకు విద్యార్థులతో కలిసి పంచాయతీరాజ్ అధికారులు ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేసి స్వచ్ఛత హి సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుండాల వజ్రమ్మ, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఈవోఆర్డీ జీవీఎస్‌వీ ప్రసాద్, కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బుచ్చి నగర పంచాయతీలో రోడ్లు ఊడుస్తున్న కమిషనర్

ముత్తుకూరు: ముత్తుకూరు ప్రధాన కూడలి నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు బూదూరు లక్ష్మి, ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మణ్‌కుమార్, ఈవోపీఆర్డీ హేమంత్‌కుమార్, ఎంఈవో మధుసూదన్, టీడీపీ నాయకులు మల్లికార్జున యాదవ్, షఫీ ఉల్లా, శ్రీనివాసులు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

సైదాపురం : మండల కేంద్రమైన సైదాపురంలో ఎం పీడీవో పురుషోత్తం శివకుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా బస్టాం డ్ సెంటర్‌లో ర్యాలీ చేశారు. తూర్పు పూండ్లలో పీఎంఏవైలో భాగంగా ఎంపీడీవో చేతుల మీదుగా పక్కా గృహాన్ని ప్రారం భించారు. కార్యక్రమంలో మండల శాఖాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అట్టహాసంగా పీఎం నరేంద్ర మోదీ జన్మదినం



కేక్ కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

పొదలకూరు, సెప్టెంబరు 17: పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముక్కు అయోధ్యరామయ్యగౌడ్, నాయకులు పెంచలయ్య, జడ వెంకటేశ్వర్లు, ఏడుకొండలు, ఎం పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటాచలం : మండలంలోని పలు గ్రామాల్లో భారత ప్రధాని నరేంద్రమోదీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఇస్కపాళెంలో బీజేపీ యువమోర్చా మండలాధ్యక్షుడు గొత్తల నరేష్ ఆధ్వర్యంలో స్థానిక పాఠశాలలో విద్యార్థులకు చాక్లెట్లు పంపిణీ చేశారు. అలాగే ప్రముఖ పుణ్యక్షేత్రమైన కసుమూరు మస్తాన్ వలీ దర్గాలో స్థానిక బీజేపీ మైనార్టీ నేత షేక్ జిలానీబాషా ఆధ్వర్యంలో నరేంద్రమోదీ పేరిట ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మిఠాయిలు పంచిపెట్టారు.

బుచ్చిరెడ్డిపాళెం : బీజేపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు రామిశెట్టి మోహన్‌బాబు ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. అలాగే బీజేపీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గండి రఘురామయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు కాసా శ్రీనివాసులు, ఆలూరు నాగవేణి, శ్రీనివాసులు, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కోటమిట్ట మహాలక్ష్మి గుడి వద్ద మంగళవారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌సింగ్ ఆధ్వర్యంల అన్నదానం, రక్తదానం చేశారు. కార్యక్రమంలో భాగంగా విశ్వకర్మ చిత్రపటానికి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పెంచలయ్య, ఖాదర్, సుమాన్, మురళి పాల్గొన్నారు.

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 17 : ఇండియన్ రెడ్‌క్రాస్‌లో దివ్యాంగుల సమక్షంలో కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. రెడ్‌క్రాస్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు దాసరి రాజేంద్రప్రసాద్, యడ వల్లి సురేష్, మరికొంతమంది రక్తదానం చేశారు.

జనసైనికుల సంబరాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలో ఒకేసారి 13326 గ్రామ సభలు నిర్వహించిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అరుదైన ప్రపంచస్థాయి రికార్డు సాధించడంతో మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు నూనె మల్లికార్జున యాదవ్ మాట్లాడుతూ ప్రపంచంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా ఏక కాలంలో ప్రపంచస్థాయిలో గ్రామ సభలు నిర్వహించి రికార్డు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర మంత్రిని కలిసిన టీడీపీ నేతలు



మహారాష్ట్ర మంత్రితో టీడీపీ జిల్లా నాయకులు

నెల్లూరు(వైద్యం), సెప్టెం బరు 17 : తిరుమల వేంకటేశ్వర స్వామి దర్శనానికి మంగళ వారం వచ్చిన మహారాష్ట్రకు చెందిన విద్యాశాఖ మంత్రి హసన్ ముష్రీఫ్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ కలిశారు. తిరుపతి కరకంబాడి రోడ్డులో ఉన్న బీవీఆర్ గెస్ట్ హౌస్‌లో టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు బొల్లినేని వెంకట రామారావుతోపాటు అజీజ్ మంత్రిని కలిసి సత్కరించారు. టీడీపీ నేతలు జాఫర్ షరీఫ్, మొహినుద్దీన్, సాబీర్‌ఖాన్, షైజుల్లా హుస్సేని, రియాజ్ కూడా పాల్గొన్నారు.

ఐఎంఎల్ డిపోలో ఏచూరికి నివాళి



ఏచూరి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న హమాలీలు

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 17 : ఇటీవల మృతి చెందిన సీపీఎం అగ్రనేత సీతారాం ఏచూరికి మంగళవారం మండలంలోని దేవరపాళెం ఐఎంఎల్ డిపోలో హమాలీలు ఘనంగా నివాళి అర్పించారు. ఆయన సంతాప సభ నిర్వహించి చిత్రపటానికి పూలమాలలువేసి శ్రద్ధాం జలి ఘటించారు. పార్టీ మండల కార్యదర్శి ఆలూరు తిరుపాలు మాట్లాడుతూ ప్రజాస్వామ్య భారతదేశాన్ని లౌకికవాదం వైపు నడిపించాలని నిత్యపోరాటాలు చేసిన గొప్పవ్యక్తి ఏచూరి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు జనార్దన్, నాగయ్య, వెంకయ్య, సింహగిరి, కార్మికులు పాల్గొన్నారు.

జడ్పీలో విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ చిత్రపటానికి పూజలు చేస్తున్న విశ్వబ్రాహ్మణులు

నెల్లూరు, (జడ్పీ): విశ్వకర్మ జయంతిని జిల్లా పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డిప్యూటీ సీఈవో చిరంజీవి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అరుణమ్మ మాట్లాడుతూ బ్రహ్మదేవుని కుమారుడైన విశ్వకర్మ శ్రీ కృష్ణుడు పాలించిన ద్వారకా నగరాన్ని సృష్టించాడని తెలిపారు.

జాతీయ కార్మిక దినంగా ప్రకటించాలి

నెల్లూరు(సాంస్కృతం): విశ్వకర్మ జయంతిని జాతీయ కార్మిక దినంగా ప్రకటించాలని విశ్వ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు గుమ్మడి కల్యాణ్ కుమార్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. మంగళవారం సంకాల వీధిలోని హరిహరనాథ స్వామి ఆలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలు జరిగాయి. ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ జయంతి రోజు కార్మికులందరికీ సెలవు ప్రకటించాలన్నారు.. విశ్వబ్రాహ్మణులు స్థపతులుగా దేవస్థాన నిర్మాణాలు, మూలవిరాట్లు ధ్వజస్తంభం ప్రతిష్ఠలు, పంచలోహ విగ్రహాల తయారీ చేస్తున్నారన్నారు. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న దేవస్థానం పాలక మండళ్లలో స్థానం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్కాట్ గణేష్, ఆచారి, లక్ష్మీ ప్రసాద్, రాజేష్ జయశంకర్, శారదమ్మ, విజయ్ పాల్గొన్నారు.



విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పతాకావిష్కరణ చేస్తున్న కమిటీ సభ్యులు

● విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విరాట్‌నగర్‌లో బ్రహ్మేంద్రస్వామి, భగవాన్ విశ్వకర్మ జయంతి వేడుకలు జరిగాయి. ఆలయం ఎదుట పంచవృత్తుల జెండా ఆవిష్కరించారు. విశేషాలంకరణలు చేశారు. పూజాలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమాల్లో ఆ సంఘం అధ్యక్షుడు కందుకూరి చెంగయ్య ఆచారి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీయే దళిత ద్రోహి

మనుబోలు, సెప్టెంబరు 17: గత వైసీపీ పాలనలో దళితులపై అనేక దాడులు జరిపి, ఎంతో మంది ప్రాణాలు తీసిన వైసీపీయే దళితద్రోహి అని రాష్ట్ర రైతు కార్యదర్శి రాయపాటి కిరణ్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన తహసీల్దారు కార్యాలయం వద్ద మాట్లాడుతూ ఇటీవల ముత్తుకూరు మండలంలో దళితులపై దాడి జరిగితే దానిని ఎమ్మెల్యే సోమిరెడ్డికి అంటగట్టడం సరికాదన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో దళితులను వేధించిన ఘనత కాకాణికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత ఐక్య వేదిక నాయకులు బళ్ల హరి, రామకృష్ణ, మోమిడి ప్రసాద్, చింతల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రధానమంత్రి ఆవాస్ యోజన ఇల్లు ప్రారంభం

మనుబోలు : ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద పూర్తి చేసుకున్న ఓ ఇంటిని ఉన్న తాధికారులు ఆదేశాలతో కాగితాలపూరులో మంగళవారం ప్రారంభించారు. ఇంటికి సంబంధించిన లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించారు. ఎంపీడీవో, గృహనిర్మాణశాఖ ఏఈ రవికుమార్, వర్క్ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు వెడిచెర్ల దినేష్‌కుమార్‌రెడ్డి, వేమా కిరణ్, గుమ్మా దిలీప్, సిహెచ్ వెంకటరమణయ్య పాల్గొన్నారు.

● **ముత్తుకూరు :** ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పథకం కింద నిర్మించిన పక్కా గృహాలను మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. హౌసింగ్ డీఈ సుబ్రహ్మణ్యం లబ్ధిదారులకు తాళాలు అందజేశారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖాధి కారులు మృత్యుంజయ, వెలుగు ఏపీఎం పెంచలయ్య పాల్గొన్నారు.

కాకాణీ... ప్రేలాపనలు మానుకో !

ముత్తుకూరు, సెప్టెంబరు 17: నిత్యం మా నాయకుడు సోమిరెడ్డిని తిట్టడమే పనిగా పెట్టుకున్న కాకాణి గోవర్ధనరెడ్డి ఇప్పటికైనా అసందర్భ ప్రేలాపనలు మానితే మంచిదని టీడీపీ మండల నాయకులు హితవు పలికారు. ముత్తుకూరు టీడీపీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఇంట్లో నగదు కౌంటింగ్ మిషన్లు పనిచేయక పిచ్చెక్కిన కాకాణి ఏం మాట్లాడుతున్నాడో తెలియని స్థితికి చేరాడన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నేల మల్లికార్జునయాదవ్, ఈపూరు మునిరెడ్డి, అబ్దుల్ షఫీఉల్లా, బొలిగర్ల శ్రీనివాసులు, అక్కయగారి ఏడుకొండలు, శంకర్, పల్లికొండ శ్రీనివాసులు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చవటపాళెంలో పశువైద్య శిబిరం

వెంకటాచలం: చవటపాళెంలో స్వర్ణభారత్ ట్రస్ట్, మండవ ఫౌండేషన్, పశు సంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. కసుపూరు పశువైద్యాధికారిణి ఎస్.సుష్మ, మండవ ఫౌండేషన్ పశు వైద్యాధికారి వీ.శ్రీనివాసులునాయుడులు పశువులకు వైద్య సేవలందించారు. గోపాల్ మిత్రలు రాము, శ్రావణ్‌కుమార్, సుధీర్, ఆర్‌బీకే ఇన్‌చార్జ్ రామరాజు పాల్గొన్నారు.

పీఎం ఆవాస్ యోజన గృహాలను పూర్తి చేయాలి

నెల్లూరు(హరనాథపురం) : ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గృహాలను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రధాని మోదీ ఒడిశాలోని భువనేశ్వర్‌లో ఆ పథకం కింద నిర్మించిన గృహాలను వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ జిల్లాలోని 11 మండలాల్లోని 56మంది లబ్ధిదారులకు గృహ మంజూరు పత్రాలను అందచేశారు.

● విశ్వకర్మ జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి కలెక్టర్ ఆనంద్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● కందుకూరు సబ్ కలెక్టర్ పూజ జాయింట్ కలెక్టర్ కార్తీక్‌ను మంగళవారం ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.

టీడీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు తీసేయండి

● హోంమంత్రికి గిరిధర్‌రెడ్డి వినతి



హోంమంత్రి అనితకు జ్ఞాపిక అందజేస్తున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, సెప్టెంబరు 17 : వైసీపీ ప్రభుత్వంలో నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో టీడీపీ కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయించారని, వాటిని తీసేయాలని టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనితను కోరారు. మంగళవారం అమరావతిలోని సచివాలయంలో మంత్రికి వినతిపత్రం అందించారు. ఉద్దేశపూర్వకంగా కేసులు పెట్టి వేధించారని తెలిపారు. అనంతరం ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డిని కలిశారు. నెల్లూరు - తాటిపర్తి రోడ్డుకు మోక్షం కలిగించాలని, సజ్జాపురం, గొల్లకందుకూరు రోడ్ల నిర్మాణానికి పాలన అనుమతులు ఇవ్వాలని కోరారు. ఎస్‌కేరోడ్డు - పెనుబర్తి, జీఎస్‌టీరోడ్డు, నెల్లూరు - కృష్ణపట్నం రోడ్లకు రోడ్ సేఫ్టీ, ఇంటర్ వెన్షన్స్ కల్పించాల ని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడుతో భేటీ అయ్యారు. కొమ్మరపూడి, కొండ్లపూడి, దేవరపాళెం గ్రామాలకు ఎత్తిపోతల ద్వారా సాగునీరు అందించే ప్రాజెక్టుకు అనుమతులు, నిధులు ఇవ్వాలని కోరారు. కాలువలకు మరమ్మతులు చేయించి చివరి ఆయకట్టు వరకు సాగునీరు పారేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వ్యవసా య శాఖ మంత్రి కింజరపు అచెన్నాయుడుతో భేటీ అయ్యారు. పలు రాజకీయపరమైన అంశాలు చర్చించామని తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకులు దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి, అరవ శ్రీనివాసులు ఉన్నారు.

గణితంపై ఆసక్తి కలిగేలా బోధించాలి

సైదాపురం,సెప్టెంబరు17: విద్యార్థులకు గణితం పట్ల ఆసక్తికలిగేలా ఉపాధ్యాయులు వినూత్నంగా బోధించాలని ఎంఈవో దయాకర్ అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ హైస్కూల్‌లో సైదాపురం, రాపూరు మండలాల్లో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల గణిత ఉపాధ్యాయులకు ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎం ఈవో-2 సుప్రియ, రిసోర్స్ పర్సన్లు వెంకటరమణయ్య, రవి పాల్గొన్నారు.

నులి పురుగుల మాత్రల పంపిణీ

సైదాపురం : మండలంలోని సైదాపురం, అనంత మడుగు గ్రామాల్లోని ఉన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యా ర్థులకు మంగళవారం ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ డీ వార్మింగ్ మంగళవారం వేశారు. కార్యక్రమంలో ఎం ఈవోలు దయాకర్, సుప్రియ, వైద్య సిబ్బంది, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

మనుబోలు: మండలంలోని పలు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కళాశాలలో మంగళవారం డీవార్మింగ్ డే నిర్వహించారు. 7,129 మందికి నులి పురుగుల నివారణ మందులు మింగించారు. ఈ కార్యక్రమాల్లో సీహెచ్‌వో రాజయ్య, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

విద్యార్థులకు మిఠాయిల పంపిణీ

విడవలూరు: మండలంలోని ఊటుకూరు గ్రామ టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి తన జన్మదినాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసకుమార్, టీడీపీ నాయకులు సింహాద్రి అయ్యప్ప, వేగూరు చంద్రారెడ్డి, తాతా రమేష్, ఉప్పాల శీనయ్య, ఆవుల రవిచంద్ర, ఉప్పాల వెంకటరమణయ్య పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

విడవలూరు, సెప్టెంబరు 17: మండలంలోని పొన్నపుడి లక్ష్మీపురం ప్రాథమిక పాఠశాల పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్న జాన్ సుందరయ్యని మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాపులు కొండూరు సుబ్రమణ్యం, రంగంగారి వేంకటేశ్వర్లు, ఆవుల గోవిందు, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ ఝాన్సీ, హెచ్‌ఎం కవిత, సహాయకులు బక్తాని శ్రీనివాసులు పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



బహుమతులు అందుకున్న చిన్నారులు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 17: బుచ్చిరెడ్డిపాళెం పెద్దూరులోని గోపాలకృష్ణయ్య ఇంగ్లీష్ మీడియం స్కూలు చిన్నారులు విజయవాడ వరద బాధితుల కోసం బుచ్చిలో రూ.25 వేలు సేకరించి మంగళవారం విద్యాశాఖ అధికారి దిలీప్‌కుమార్‌కు అందజేశారు. ఎంఈఓ ఆ మొత్తాన్ని అపస్మా జిల్లా అధ్యక్షులకు అందజేశారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా వసూలు చేసిన మొత్తాన్ని కలిపి సీఎం సహాయనిధికి ఇవ్వాలని ఆదేశించారు. విరాళాలు సేకరించడంలో వెయ్యి రూపాయలకు పైగా వసూలు చేసిన విద్యార్థులకు ఎంఈఓ ప్రశంసా పత్రాలతోపాటు చిన్న బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నేలనూతల శ్రీధర్, ప్రిన్సిపాల్ సురేఖ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలభిషేకం

వెంకటాచలం, సెప్టెంబరు 17 : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా మంగళవారం వెంకటాచలంలోని జనసేన పార్టీ కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. సర్వేపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సురేష్‌నాయుడు మాట్లాడుతూ జనసేనాని పవన్ కళ్యాణ్ పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఒకే రోజు వేల సంఖ్యలో గ్రామసభలు నిర్వహించి వరల్డ్ రికార్డు సృష్టించారన్నారు. కార్యక్రమంలో ఆయకులు గుమ్మినేని వాణిభవాని, శ్రీహరి, చెంచయ్య, మల్లికార్జున్, రవికుమార్, శివకుమార్, అఖిల్, చిన్న, అనురాజ్, నరసింహులు తదితరులున్నారు.

మినీ సైన్సు ల్యాబ్ ప్రారంభం

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 17: బుచ్చిరెడ్డిపాళెంలోని బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో సమర్థనం ట్రస్టు ఆధ్వర్యంలో సుమారు రూ.8 లక్షలతో ఏర్పాటు చేసిన మినీ సైన్స్‌ల్యాబ్‌ను మంగళవారం ఎంఈవోలు దిలీప్‌కుమార్, పీవీ రత్నంలు ప్రారంభించారు. అలాగే దివ్యాంగులకు హెరా లైఫ్ అధ్వర్యంలో పోషకాహార సంచులు పంపిణీ చేశారు. ట్రస్టు సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం. సుజాత, జిల్లా రిసోర్సు సభ్యులు గండికోట సుధీర్‌కుమార్, ట్రస్టు ప్రోగ్రాం అధికారి లోకేష్‌కుమార్, సభ్యులు రంగారావు, హెర్బా లైఫ్ మెంబర్లు జగన్మోహన్‌రావు, సైన్స్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

20న బంగారుపాళ్యానికి మంత్రి లోకేష్‌ రాక



చిత్తూరు సిటీ, సెప్టెంబరు 17: రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌ 20వ తేదీన బంగారుపాళ్యం రానున్నారు.బంగారుపాళ్యం ఆస్పత్రిలో ఏర్పాటు చేయించిన డయాలసిస్‌ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. తొలుత 19న లోకేష్‌ పర్యటన వుంటుందని ప్రచారం జరిగింది.చివరకు 20వ తేదీకి పర్యటన ఖరారైంది.

100వ కి.మీ

3ఫిబ్రవరి 2023
బంగారుపాళ్యం శివార్లలో తొలి వందవ కిలోమీటరు మైలు రాయి.

హామీ: ప్రభుత్వం ఏర్పాటైన మొదటి వంద రోజుల్లోపు బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రికి డయాలసిస్‌ పరికరాలు అందజేస్తాం.

కూటమి ప్రభుత్వ విజయంలో ఒక కీలక మైలురాయి యువగళం పాదయాత్ర. తొలి అడుగు పడింది ఉమ్మడి చిత్తూరు జిల్లాలోనే. కుప్పంలో 2023 జనవరి 27న మొదలైన నడక దాదాపు ఏడాది పాటు సాగింది. జగన్‌రెడ్డి ప్రభుత్వం అడుగడుగునా సృష్టించిన అవాంతరాలను అధిగమిస్తూ, వైసీపీ శ్రేణుల బెదిరింపులను ఎదుర్కొంటూ యువగళం సాగింది. ఈ సందర్భంగా ప్రతి వంద కిలోమీటర్లకూ ఒక మైలు రాయిని లోకేష్‌ ఆవిష్కరించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల లోగా అమలు చేస్తామంటూ కొన్ని హామీలు ఇచ్చారు. ఇలా ఉమ్మడి జిల్లాలో ఆరు మైలు రాళ్ల ప్రతిష్ఠాపన జరిగింది. వీటిలో తొలి హామీ బంగారుపాళ్యంలో కిడ్నీ బాధితుల కోసం డయాలసిస్‌ కేంద్రం నెలకొల్పుతామన్నది. చెప్పినట్టే వంద రోజుల్లోగా ఆ పని చకచకా జరిగిపోతోంది. ఖాళీ ఖజానాతో ప్రభుత్వ పాలన మొదలైనా మాటతప్పరనే నమ్మకాన్ని ఇది కలిగిస్తోంది. దీంతో పాటూ మిగిలిన హామీలు కూడా అమలవుతాయనే భరోసాను ఇస్తోంది. ఈ సందర్భంగా కొత్త ప్రభుత్వం అధికారం చేపట్టి వంద రోజులు సమీపిస్తున్న వేళ లోకేష్‌ హామీల వర్తమాన స్థితిని ఆంధ్రజ్యోతి అందిస్తోంది.

1700వ కి.మీ

21జూన్2023
డక్కిలి మండల కేంద్రంలో శిలాఫలకం.

హామీ: హ్యాండ్‌ లూమ్‌ టెక్స్‌టైల్‌ పార్కు స్థాపిసాం.

ప్రస్తుత స్థితి: ఇంకా అమలు ప్రయత్నాలు మొదలు కాలేదు.

100 రోజుల గడువు సమీపిస్తోంది యువ నాయకా!



- తిరుపతి, ఆంధ్రజ్యోతి

● నారా లోకేష్‌ హామీల స్థితిగతులపై గ్రౌండ్‌ రిపోర్ట్‌ ● చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఆరు చోట్ల శిలాఫలకాలు

తొలి హామీ అమలైంది

బంగారుపాళ్యంలో డయాలసిస్‌ కేంద్రం ఏర్పాటు



బంగారుపాలెం ప్రభుత్వాస్పత్రి వార్డులో డయాలసిస్‌ పరికరాలు అమర్చుతున్న దృశ్యం

ప్రస్తుత స్థితి: పూతలపట్టు నియోజకవర్గ పరిధిలోని పరిసరాల గ్రామాల్లో కిడ్నీవ్యాధిగ్రస్థులు డయాలసిస్‌ చేసుకోవాలంటే వ్యయప్రయాసలకోర్చి తిరుపతి, వేలూరు, చిత్తూరు ఆస్పత్రులకు వెళ్ళాల్సివచ్చేది. దీన్ని గుర్తించిన స్థానిక టీడీపీ నాయకులు, మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్‌ వినతి మేరకు బంగారుపాళ్యంలో డయాలసిస్‌ కేంద్రం ఏర్పాటు చేయాలని యువగళం పాదయాత్రలో నారా లోకేష్‌కు విన్నవించారు. ఆయన స్పందించి వెంటనే డయాలసిస్‌ కేంద్రం ఏర్పాటు చేయడానికి హామీ ఇచ్చి, అదేరోజు శిలాఫలకం కూడా ఆవిష్కరించారు. ఇప్పుడది అమలు రూపు దాల్చింది. నారా లోకేష్‌ అభ్యర్థనతో కేంద్ర ప్రభుత్వం ప్రైమ్‌ మినిష్టర్‌ నేషనల్‌ డయాలసిస్‌ ప్రోగ్రామ్‌ పథకం కింద ఒక్కోటి రూ. 50 లక్షల విలువ చేసే ఐదు డయాలసిస్‌ పరికరాలను బంగారుపాళ్యం ఆస్పత్రికి కేటాయించింది. ఇవి పదిహేను రోజుల కిందట ఆస్పత్రికి చేరుకున్నాయి. కొత్తగా నిర్మించిన ఆస్పత్రి భవనంలో వీటిని అమర్చుతున్నారు. కొత్త కేంద్రంలో కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న సుమారు 30 మంది కిడ్నీ బాధితులు తమ పేర్లు నమోదు చేసుకున్నారు. కొత్తగా ఏర్పాటు కానున్న ఈ డయాలసిస్‌ కేంద్రంలో ప్రత్యేక వైద్యనిపుణులతో పాటు సిబ్బంది అందుబాటులో ఉంటూ కిడ్నీ వ్యాధి బాధితులకు డయాలసిస్‌ సేవలు అందజేయనున్నారు.



నాలాంటి వారికి వరం



ఏడు సంవత్సరాలుగా నేను కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నా. కుప్పంలోని పీఈఎస్‌ మెడికల్‌ కళాశాలలో కొంతకాలం డయాలసిస్‌ చేసుకున్నా.ప్రస్తుతం చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో డయాలసిస్‌ చేసుకుంటున్నా. డయాలసిస్‌ పేషెంట్‌గా బస్సు ప్రయాణాల్లో నరకం అనుభవిస్తున్నా. నా లాంటి బాధితులకు బంగారుపాళ్యంలో డయాలసిస్‌ కేంద్రం ఏర్పాటు ఓ వరంలా భావిస్తున్నా. నారా లోకేష్‌కు కృతజ్ఞతలు.

- రామయ్య, బంగారుపాళ్యం దళితవాడ

సంతోషంగా ఉంది



మా ఇంటికి కూతవేటు దూరంలోనే నారా లోకేష్‌ చొరవతో డయాలసిస్‌ కేంద్రం ఏర్పాటవుతోంది. నేను వారానికి మూడు సార్లు చిత్తూరుకు వెళ్ళి డయాలసిస్‌ చేసుకుని వస్తుంటా. ఇక ముందు ఈ తిప్పలు ఉండవంటేనే హాయిగా ఉంది. ఇప్పటికే నేను బంగారుపాళ్యం కేంద్రానికి వెళ్ళి పేరు నమోదు చేసుకున్నా.

- రాజేంద్ర, బంగారుపాళ్యం దళితవాడ

ఆక్వాకు ఊరట

1800వ కి.మీ

26 జూన్‌ 2023
చిట్టమూరు మండలం అరవపాలెంలో శిలాఫలకం.

హామీ: ఆక్వా రంగానికి గతంలో ఇచ్చిన సబ్సిడీలు, ప్రోత్సాహకాలు పునరుద్ధరించి ఆదుకుంటాం.

ప్రస్తుత స్థితి: గత ఐదేళ్ళలో వైసీపీ ప్రభుత్వం ఆక్వా జోన్‌, నాన్‌ ఆక్వా జోన్‌లుగా విభజించి విద్యుత్‌ ఛార్జీలు వేర్వేరుగా వసూలు చేసింది. ఆక్వా జోన్‌లో యూనిట్‌కు రూ. 2, నాన్‌ జోన్‌లో యూనిట్‌కు రూ. 4 నుంచీ రూ. 7 వరకూ వసూలు చేసింది. ఇపుడు కూటమి ప్రభుత్వం వచ్చాక జోన్లు ఎత్తివేసి అన్ని చోట్లా యూనిట్‌కు రూ. 2 వసూలు చేస్తున్నారు. నారా లోకేష్‌ హామీల అమలులో భాగంగా ఇదొక ఊరట. అలాగే మిగిలిన సబ్సిడీలు, ప్రోత్సాహకాలపై అధ్యయనం చేయాలని లోకేష్‌ అధికారులను ఆదేశించారు.



చిట్టమూరు మండలం అరవపాలెంలో శిలాఫలకం

200వ కి.మీ

11 ఫిబ్రవరి 2023
కార్వేటినగరం మండలం కత్తిరిపల్లి వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

హామీ: వంద రోజుల్లోనే గంగాధర నెల్లూరులో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తా.

ప్రస్తుత స్థితి: డిగ్రీ కళాశాల ఏర్పాటు దిశగా ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దశాబ్దాలుగా ఈ ప్రాంత విద్యార్థులు డిగ్రీ కోర్సుల కోసం చిత్తూరు, కార్వేటినగరం, పుత్తూరు వెళ్ళాల్సి వస్తోంది. ఇక్కడ కాలేజీ ఏర్పాటైతే పెనుమూరు, జీడీ నెల్లూరు, పాలసముద్రం, శ్రీరంగరాజపురం మండలాల విద్యార్థులకు అనుకూలంగా వుంటుంది.



300వ కి.మీ

19 ఫిబ్రవరి 2023
శ్రీకాళహస్తి మండలం తొండమానుపురంలో శిలాఫలకం.

హామీ: తొండమానుపురం కేంద్రంగా చుట్టుపక్కల 13 గ్రామాలకు రక్షిత తాగునీటి పథకం ఏర్పాటు చేయిస్తా.

ప్రస్తుత స్థితి: ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

400వ కి.మీ

1 మార్చి 2023
నేంద్రగుంటలో శిలాఫలకం.

హామీ: నేంద్రగుంటలో పది పడకల సామర్థ్యంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయిస్తా.

ప్రస్తుత స్థితి: ఈ దిశగా ఇప్పటి దాకా ఎలాంటి చర్యలూ లేవు. నేంద్రగుంటలో ఎప్పటి నుంచో ఆరోగ్య ఉప కేంద్రం వుంది. ఇది పాకాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోకి వస్తుంది.నేంద్రగుంట, పరిసర గ్రామాల ప్రజలు వైద్య చికిత్స కోసం పాకాల, పి.కొత్తకోట పీహెచ్‌సీలకు గానీ, చంద్రగిరి కమ్యూనిటీ ఆసుపత్రికి గానీ వెళ్లాలి. జాతీయ రహదారిపై వున్న నేంద్రగుంటలో పది పడకల సామర్థ్యంతో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే పరిసర గ్రామాల వారికే కాకుండా ఆ మార్గంలో ప్రయాణించే ప్రజలకు కూడా ఉపయోగపడుతుంది.



పాకాల మండలం నేంద్రగుంటలో శిలాఫలకం



మంత్రి లోకేష్‌కు విరాళం అందజేస్తున్న ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్‌ భూపతి నాయుడు

వరద బాధితులకు ఎస్వీయూ ఉద్యోగుల ఒక రోజు వేతనం

మంత్రి లోకేష్‌కు రూ.47 లక్షల 48 వేల చెక్కు అందజేత

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 17: వరద బాధితుల కోసం ఎస్వీ యూనివర్సిటీలో టీచింగ్‌, నాన్‌ టీచింగ్‌, రిటైర్డు ఉద్యోగులు ఒక రోజు వేతనాన్ని విరాళంగా ప్రకటించారు. ఇందుకు సంబంధించి రూ.47.48 లక్షల చెక్‌ను రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌కు వర్సిటీ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్‌ భూపతి నాయుడు మంగళవారం అందజేశారు. ఉద్యోగుల దాతృత్వాన్ని మంత్రి అభినందించారు.

రూ. వంద ఇస్తేనే మస్టర్‌ వేస్తా

● ఉపాధి కూలీలతో ఫీల్డ్‌ అసిస్టెంట్‌ మాటల వీడియో వైరల్‌

నాగలాపురం, సెప్టెంబరు 17: ఉపాధి పనులు కావాలన్నా.. బిల్లులు మంజూరు చేయాలన్నా కార్డుకు రూ.వంద కట్టాల్సిందే.. లేకపోతే మస్టర్‌ ఆపేస్తాం.. కూలి డబ్బు రాదు..' అంటూ మండలంలోని ఎస్‌ఎస్‌పురం గ్రామానికి చెందిన ఫీల్డ్‌ అసిస్టెంట్‌ మాధవ్‌ కూలీలను బెదిరిస్తున్న వీడియో ఒకటి వైరల్‌ అవుతోంది. పై అధికారులు డబ్బు వచ్చిందా అని ఒత్తిడి చేస్తున్నారు.. వారికి నేను ఏమి సమాధానం చెప్పాలి' అంటూ ఆ వీడియోలో హుకుం జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఆ గ్రామ పంచాయతీలో దాదాపు 500 జాబ్‌ కార్డులున్నాయి. వారానికి ఒక్కొక్క కార్డుకు రూ.100 చొప్పున మాధవ్‌ వసూలు చేస్తున్నారు. ఈ లెక్కన నెలకు దాదాపు రూ.2లక్షలు వసూలు చేస్తున్నట్లు కూలీలు చెబుతున్నారు. తమకు ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని, డబ్బు ఇచ్చుకోలేమని చెప్పిన కూలీలను పనులు ఇచ్చేది లేదని, మస్టర్‌ ఆపేస్తానని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి ఘటనలు మండలంలో తరచూ జరుగుతున్నా సంబంధిత ఏపీవో పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.



కూలీలను బెదిరిస్తున్న మాధవ్‌

వెనామి రొయ్యలకు 'వైట్‌స్పాట్‌'

● వైరస్‌తో చనిపోతున్న పిల్లలు

కోట,సెప్టెంబరు17: ఈ ఏడాది వెనామి రొయ్యల సాగు రైతులకు దెబ్బమీద దెబ్బ పడుతోంది. నిన్న మొన్నటి వరకు నకిలీ సీడ్‌, వాతావరణంలో మార్పులతో నష్టాలను చవిచూశారు. ఇప్పుడు వైట్‌ స్పాట్‌ వైరస్‌తో రొయ్యలు చనిపోతుండడంతో లబోదిబోమంటున్నారు. సముద్రతీర మండలాలైన కోట, వాకాడు, చిట్టమూరులలో సుమారు 2,500 ఎకరాల్లో ఈ రకం రొయ్యలు సాగులో ఉన్నాయి. 3వారాలుగా సాగులో ఉన్న వంద నుంచి 120, 150 కౌంట్‌ వెనామి రొయ్య పిల్లలకు వైట్‌స్పాట్‌ వైరస్‌ ప్రబలింది. వైరస్‌ సోకిన పిల్లలు మేత తీసుకోవడం మానేస్తున్నాయి. క్రమేపి బరువు తగ్గుతూ పెరుగుదల ఆగిపోతోంది. ఫీడ్‌ తీసుకోని కారణంగా 120 - 130 కౌంట్‌ ఉన్న పిల్లలు మొప్పలపై తెల్లని మచ్చ ఏర్పడి చనిపోతున్నాయి. ఇప్పటికే రైతులు రూ.లక్షల్లో నష్టపోయారు. కోట మండలం గోవిందపల్లి, సిద్ధవరం,కొత్తపట్నం, గోవిందపల్లి పాళెం ప్రాంతాల్లో రైతులు తక్కువ కౌంట్‌తో రొయ్యలను పట్టి, అందినకాడికి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. సీడ్‌ ధర కూడా గిట్టుబాటు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల వాతావరణంలో వస్తున్న మార్పులే ఈ వైరస్‌కు కారణమని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

ఇసుక తరలిపోతుంటే ఏమి చేస్తున్నారు?

● ఏర్పేడు తహసీల్దారుపై కలెక్టర్‌ ఆగ్రహం

ఏర్పేడు, సెప్టెంబరు 17: మండలంలో విచ్చలవిడిగా ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే ఏమి చేస్తున్నారని కలెక్టర్‌ వెంకటేశ్వర్‌ ఏర్పేడు తహసీల్దారు భార్గవిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. అక్రమ రవాణాను అరికట్టకపోతే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. ట్రాక్టర్లు, టిప్పర్లను సీజ్‌ చేసి, పోలీసులకు అప్పగించాలని ఆదేశించినట్లు తెలిసింది. అక్రమ రవాణాకు పాల్పడితే ఎవరైనా వదిలిపెట్టొద్దని, తమకు సమాచారం అందించాలని స్వర్ణముఖి పరివాహక ప్రాంతాల్లో వీఆర్వోలను ఆదేశించారు.

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్‌]

మల్లిమడుగు డ్యాం నుంచి మట్టి అక్రమ తరలింపునకు అడ్డుకట్ట



మట్టి తరలించే ప్రధాన రహదారిలో లారీలు వెళ్లకుండా తీసిన గుంత

రేణిగుంట, సెప్టెంబరు 17: మల్లిమడుగు డ్యాం పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా మట్టి తరలిపోకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. మట్టిదందాపై ఆంధ్రజ్యోతిలో వార్త ఇటీవల ప్రచురితమైంది. స్పందించిన అధికారులు ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. మంగళవారం తహసీల్దారు సురేష్‌బాబు నేతృత్వంలో మల్లిమడుగు నుంచి అక్రమ మట్టి తరలించే ప్రధాన రహదారిలో టిప్పర్‌ లారీలు వెళ్లకుండా ఉండేందుకు జేసీబీ సాయంతో రెండు చోట్ల ట్రెంచ్‌లు ఏర్పాటు చేశారు.

దుకాణాల్లో విజిలెన్సు సోదాలు



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 17: తిరుపతి, ఏర్పేడు, శ్రీకాళహస్తి, చిత్తూరు తదితర ప్రాంతాల్లోని దుకాణాల్లో విజిలెన్స్‌ అధికారులు మంగళవారం సోదాలు చేశారు. కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం పెంచిన నేపథ్యంలో కొందరు వ్యాపారులు వంట నూనెలను బ్లాక్‌ మార్కెట్‌కు తరలించి, కృత్రిమ కొరత సృష్టిస్తుండడంపై అధికారులు దృష్టి సారించారు. నాలుగు టీములుగా ఏర్పడి తిరుపతి, ఏర్పేడు, శ్రీకాళహస్తి, చిత్తూరులలో సోదాలు చేశారు. అధిక ధరకు విక్రయిస్తున్న, నోస్టాక్‌ బోర్డు పెట్టిన 10 దుకాణాలపై కేసులు నమోదు చేశారు.

310 మొబైల్‌ ఫోన్ల రికవరీ

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 17: రూ.62 లక్షల విలువ చేసే 310 మొబైల్‌ ఫోన్లను రికవరీ చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. రికవరీ చేసిన ఫోన్లను మంగళవారం ఎస్పీ కార్యాలయంలో బాధితులకు అప్పగించారు. ఎస్పీ మాట్లాడుతూ మొబైల్‌ ఫోన్లు పోగొట్టుకున్న వారు వెంటనే మొబైల్‌ హంట్‌ లేదా సీఈఐఆర్‌ పోర్టర్‌ ద్వారా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఇప్పటివరకు 10 విడతల్లో రూ.6.07 కోట్ల విలువ చేసే 3,530 మొబైల్‌ ఫోన్లు రికవరీ చేసి, బాధితులకు అప్పగించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచారి, వెంకట్రావు, సైబర్‌ క్రైం సీఐ వినోద్‌ కుమార్‌ పాల్గొన్నారు.



రికవరీ చేసిన ఫోన్లను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

స్కూల్ ఆటో బోల్తా

ఐదుగురు విద్యార్థులకు గాయాలు



ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు

వాకాడు, సెప్టెంబరు 17: పాఠశాలకు పిల్లలను తరలిస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడిన ఘటన వాకాడు మండలంలోని కాశీపురం వద్ద మంగళవారం చోటుచేసుకుంది. కాశీపురం నుంచి విద్యార్థులు చిట్టమూరు మండలం మెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆటోలో రోజూ వెళ్లి వస్తుంటారు. అధిక సంఖ్యలో విద్యార్థులు ఉండటం, డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతో కాశీపురం స్వర్ణముఖినది ఒడ్డుపై ఆటో నదిలోకి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో విద్యార్థులు అమృత వర్ష, హిమబిందు, జశ్వంత్, లోకేష్, మాధవి గాయపడ్డారు. వీరిని వాకాడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 17: స్థానిక రెండో పట్టణ పరిధిలోని ఎస్‌కేఆర్ ప్రభుత్వ కళాశాల సమీపంలో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును ఇద్దరు వ్యక్తులు అపహరించుకు వెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ శ్రీనివాస్ కథనం మేరకు... స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో తిలక్‌నగర్‌కు చెందిన అనురాధ దుకాణం నిర్వహిస్తోంది. మంగళవారం గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తు మోటారు సైకిల్‌పై వచ్చి కూల్‌డ్రింక్స్ కావాలని అడిగారు. ఇంతలో ఆమె మెడలోని బంగారు 12గ్రాముల బంగారు గొలుసును లాక్కుని మోటారుసైకిల్‌పై పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా ఫలాభిషేకం



మల్లాం వీధుల్లో కొల్లాసుర, మల్లాసుర యుద్ధ ఘట్టాలు

చిట్టమూరు, సెప్టెంబర్ 17: మండల పరిధిలోని మల్లాంలో వెలసిన వల్లీ, దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఫలాభిషేకం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ కామిరెడ్డి మునిశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో శతస్తంభాల కల్యాణ మండపంలో వల్లీ, దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామితో పాటు ఉత్సవమూర్తులకు 40 రకాల పండ్లు, తేనె, నెయ్యి, పంచదారతో అభిషేకం చేశారు. అనంతరం నందిసేవ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మల్లాసుర, కొల్లాసుర, యుద్ధఘట్టాల సన్నివేశాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సునీల్ రెడ్డి, గ్రామస్తులు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటికి ఇబ్బందులు రానివ్వం



జీనుగులవారి వీధిలో పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 17: మున్సిపాలిటీలోని 25వార్డుల్లో తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు రానివ్వబోమని మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అన్నారు. మంగళవారం స్థానిక సమ్మర్ స్టోరేజీ వద్ద మంచి నీటిని, మోటార్లు, పోలేరమ్మ ఆలయం, జీనుగులవారి వీధిలోని జాతర ఏర్పాట్లు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామశక్తి పోలేరమ్మ జాతర కోసం లక్షలాది మంది భక్తులు వస్తారని, ఈ సందర్భంగా మంచి నీటి కొరత లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, కమిషనర్ రషీద్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు నీటి సరఫరాలో అంతరాయం

వెంకటగిరి, సెప్టెంబరు 17: పట్టణంలోని 25వార్డుల్లో ఈనెల 19వ తేదీ నీటి సరఫరా నిలిపి వేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్ తెలిపారు. బోర్ల మోటర్ల మరమ్మతులు, పైప్‌లైన్ లీకేజీల నివారణ పనులు చేపడుతున్నందున నీటిని సరఫరా ఆపేస్తున్నామని తెలిపారు.

నవరాత్రి ఉత్సవాల పనులకు టెండర్లు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 17: స్థానిక ధర్మరాజస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి వివిధ పనులకు టెండర్లను పరిశీలించడం జరిగిందని ఆలయ ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ధర్మరాజస్వామి ఆలయంలో టెండర్ల బాక్స్‌ను తెరిచి టెండర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 2నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి ఆలయంలో పూలమాలలు, విద్యుద్దీపాలంకరణ తదితర ఏర్పాట్లు చేసేందుకు సీల్డ్‌టెండర్లను పిలవడం జరిగిందన్నారు. తక్కువగా నమోదు చేసిన వారికి టెండర్లు కేటాయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, వాటంబేడు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి చెక్కుల అందజేత

గూడూరు, సెప్టెంబరు 17: విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం సీఎం సహాయనిధికి మంగళవారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌కు పలువురు చెక్కులు అందజేశారు. చెన్నూరు గ్రామానికి చెందిన చేనేత కార్మికులు రూ.50వేల చెక్కు, వెంకటేశ్వర్లు అనే చేనేత కార్మికుడు రూ.20వేలు విలువ చేసే చేనేత చీరలను అందజేశారు. కార్యక్రమంలో మట్టం శ్రావణి, కటికాల శ్రీనివాసులు, మదిర వెంకటేశ్వర్లు, రాజనాల, బాలాజీ, చలపతి, శీనయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్వర్ణాంధ్రభారతి పాఠశాల ఆధ్వర్యంలో రూ.60,420, గుండ్ల గోవిందురాజులు రూ.50వేలు, రైతుబజారు వ్యాపారస్థులు రూ.25వేలు చెక్కులను అందజేశారు.

నగదు ప్రోత్సాహక బహుమతి



నగదు అందజేస్తున్న సంఘం ప్రతినిధులు

గూడూరు అర్బన్, సెప్టెంబరు 17: స్థానిక త్యాగరాజవీధిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో మంగళవారం బలిజ మహిళాసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఓ విద్యార్థినికి నగదు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం గౌరవాధ్యక్షురాలు సారంగం సులక్ష్మి మాట్లాడుతూ పట్టణానికి చెందిన సుప్రజ చదువులో రాణిస్తుండడంతో ప్రోత్సహించేందుకు తమ సంఘం తరుపున రూ.5వేలు అందజేశామన్నారు. కార్యక్రమంలో పద్మావతి, సువర్ణలక్ష్మి, ఉషా, సాయిజ్యోత్స్న, శ్రావణి, రాధిక, రాధా పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

దొరవారిసత్రం, సెప్టెంబరు 17: దొరవారిసత్రంలోని ఏకొల్లు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మంగళవారం హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నవజీవన్ ఆర్గనైజేషన్, సీసీసీయూ ప్రాజెక్టు సిబ్బంది విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం నరసింహరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెరియార్ జయంతి

కోట, సెప్టెంబరు 17: కోట పట్టణంలో మంగళవారం ద్రవిడ హక్కుల పోరాట యోధుడు పెరియార్ రామస్వామి జయంతిని మంగళవారం బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి చోడవరం సుధాకర్, గూడూరు ఇన్‌చార్జి మీజూరు సుబ్రహ్మణ్యం, మురళి, మల్లికార్జున్, రవి, కర్లపూడి పోలయ్య, ఆర్వీ రమణయ్యపాల్గొన్నారు.

విద్యాసామగ్రి పంపిణీ

గూడూరు అర్బన్, సెప్టెంబరు 17: స్థానిక జానకిరాంపేటలోని గురుకుల పాఠశాలలో విద్యార్థినులకు మంగళవారం హీరాబెన్ మాతాజీగ్లోబల్ ట్రస్ట్ అధ్యక్షుడు కంకణాల పెంచలనాయుడు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు.

95 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యం లారీ వద్ద సీఐ, సీఎస్ డీటీ

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 17: నాయుడుపేట మండలంలోని శ్రీనివాసాపురం సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 95బస్తాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ బాబీ తెలిపారు. మంగళవారం ఉ వాహనాలు తనిఖీ చేస్తుండగా సూళ్లూరుపేట నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న లారీలో రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని సివిల్ సప్లయ్ డీటీ ఓబయ్య తెలిపారు.

రారెత్తిస్తున్న ఉల్లి

తగ్గిన దిగుమతులు ● వారం నుంచి ధర పైపైకి



మార్కెట్‌లో విక్రయిస్తున్న ఉల్లిపాయలు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 17: కూరల్లో నిత్యావసరమైన ఉల్లి ధర రారెత్తిస్తోంది. సాధారణంగా ఉల్లిపాయల్ని కోస్తుంటే కన్నీళ్లు వస్తుంటాయని, అటువంటిది ఇప్పుడు కొనాలన్నా ధరలు మండిపోయి కన్నీళ్లు వస్తున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో వరదల కారణంగా ఉల్లిపాయల ధర పెరుగుతోందని వ్యాపారులు పేర్కొంటున్నారు. కర్ణాటక, పుణే నుంచి అవసరమైనంత రాకపోవడంతో ధరలు పెరుగుతున్నాయి. మహారాష్ట్రంలో కొత్తపంట మార్కెట్‌కు రాకపోవడంతో దీపావళి వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వ్యాపారులు చెబుతున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఒకప్పుడు కిలో రూ.15 నుంచి రూ.30 వరకు ధర ఉండే నాణ్యమైన ఉల్లిపాయలు నేడు రూ.60 నుంచి రూ.70కి చేరుకోవడం గమనార్హం.

చవితి ముందు నుంచి ధర పైపైకి

మహారాష్ట్రలోనే కిలో నాణ్యమైన ఉల్లిపాయలు రూ.45 పలుకుతుందని, అక్కడ నుంచి రవాణా ఇతర ఖర్చులు కలిపి కిలోకు రూ.10 అవుతుందని, దీంతో స్థానికంగా మార్కెట్‌లో రూ.60 విక్రయిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. మార్కెట్‌లో నాణ్యతను అనుసరించి రూ.40, రూ.50, రూ.60 వరకు ధర పలుకుతోంది. గతంలో పోలిస్తే హోల్‌సేల్ మార్కెట్‌కు వచ్చే సరుకు సగానికి పడిపోయింది. గతంలో ఉల్లిగడ్డల లారీలు నాలుగైదు వచ్చేవి. ప్రస్తుతం మూడు రోజులకొకసారి రెండు లారీలు కూడా రావడం లేదని వ్యాపార వర్గాలు వెల్లడించాయి. మన రాష్ట్రంలో ఉల్లి పంట రావడంలో జాప్యం జరగడం ధర పెరిగేందుకు మరో కారణం.

మహారాష్ట్ర మార్కెట్టే ఆధారం

మహారాష్ట్రలోని షోలాపూర్, నాసిక్ ఉల్లిగడ్డలకు పెట్టింది పేరు. అధికశాతం సరుకు అక్కడ నుంచి మన రాష్ట్రానికి దిగుమతి అవుతుంది. తర్వాత మధ్యప్రదేశ్, కర్ణాటక నుంచి ఉల్లిపాయలు మోస్తరుగా వస్తుంటాయి. ప్రస్తుతం అక్కడ కూడా విస్తారంగా వర్షాలు కురిసి వరదలు ముంచెత్తాయి. మరోవైపు మన రాష్ట్రంలోని కర్నూలులో ఉల్లి పంట జాప్యమైంది. ఆగస్టు పంట రాలేదు. గుంటూరు, ప్రకాశం జిల్లాలో తక్కువ విస్తీర్ణంలో ఉల్లిగడ్డల పంట పండిస్తారు. అది ఫిబ్రవరి నుంచి వస్తుంది. దీంతో ఏడాదిలో తొమ్మిది నెలల వరకు మహారాష్ట్ర నుంచి వచ్చే సరకు పైనే ఆధారపడాల్సి ఉంటుందని వ్యాపారులు పేర్కొంటున్నారు. కేవలం వర్షాలు, వరదలు, వల్లే ధరలు పెరిగిందని, రాబోయే రోజుల్లో తగ్గే అవకాశం ఉందని వ్యాపార వర్గాలు వెల్లడించాయి.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కండి



కడపత్రలో మొక్కను నాటుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, సెప్టెంబరు 17: పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు అవ్వాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మండల పరిధిలోని కడపత్రలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద 16మంది లబ్ధిదారులకు ఇళ్ల పత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గొంజి వెంకటేశ్వర్లు, పాకం వెంకటసుబ్బయ్య, సుధాకర్ రెడ్డి, తిరుపాల్, ఎల్లయ్య, ఎంపీడీవో ప్రమీలారాణి, గృహ నిర్మాణశాఖ ఈఈ మోహన్ రావు, డీఈ ధశయ్య, ఏఈ మహమ్మద్ అక్రం, ఏపీవో నాగరాజు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని ఎన్ఎస్ఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఎంఈవో మునిరత్నం ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పరిశుభ్రత ప్రతిజ్ఞ చేసి ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు పుష్ప, ఉపాధ్యాయుడు మురళి, విద్యార్థులు పాల్గొన్నారు.

తడ: మండల కేంద్రంలో ఎంపీడీవో విజయకుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో మానవహారం చేశారు. పలు శాఖల అధికారులు, టీడీపీ నాయకులు రవి, కోఆప్షన్ సభ్యుడు హుస్సేన్ పాల్గొన్నారు.

దొరవారిసత్రం: దొరవారిసత్రంలో ఏకొల్లు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో కలసి అధికారులు ర్యాలీ చేపట్టారు. నేషనల్ హైవే అథారిటీ అధికారులు మావిళ్లపాడు మోడల్ స్కూల్ విద్యార్థులతో కలసి జాతీయ రహదారి పక్కన మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సుమలత, ఎన్‌హెచ్ఏఐ పీడీ ఎంకే చౌదరి, డీఎం సుదర్శన్, టోల్‌ప్లాజా సీవోఎం హరిపాండురంగస్వామి, మేనేజర్ నాగరాజ్ పాల్గొన్నారు.

పెళ్లకూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. దొడ్లవారిమిట్ట గ్రామంలో ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు, జీలపాటూరు సర్పంచు కందమూడి శివకుమార్ ఆధ్వర్యంలో చెత్త చెదారాలను తొలిగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శాంతి, వెలుగు సిబ్బంది చంద్రసేన, టీడీపీ నాయకులు ఆరూరు వెంకటేశ్వర్లు, బడతోటి మురళి తదితరులు పాల్గొన్నారు.

కోట: డీఎల్‌పీవో వెంకటరమణ, ఎంపీడీవో భవానీ, సీడీపీవో మునికుమారి ఆధ్వర్యంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. బజారుసెంటర్‌లోని గాంధీ బొమ్మ సెంటర్ వద్ద మానవహారం పాటించారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



పరిసరాలను శుభ్రం చేస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 17: పట్టణ ప్రజలు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక ఐసీఎస్‌రోడ్డు, కూరగాయల మార్కెట్ ప్రాంతాల్లో సబ్‌కలెక్టర్, ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు చీపురలను చేతపట్టుకుని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు చెత్తాచెదారాలను రోడ్లపైన వేయకుండా కుండీలలో, చెత్త సేకరణకు వచ్చే సిబ్బందికి అందజేయాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛతను సాధించగలుగుతామని, ప్రతి ఒక్కరూ ఇందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, శీలం కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, బత్తిన ప్రణీత్, రవీంద్రరెడ్డి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బాలాయపల్లి: మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో వినీల్ కుమార్, ఉద్యోగులు చీపుర్లు చేతపట్టి బస్టాండు పరిసరాలను శుభ్రపరిచారు. మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు దట్టం అంజలి, ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ మోహన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వాకాడు: మండల పరిషత్ కార్యాలయం నుంచి అశోక్ పిల్లర్ వరకు ఎంపీడీవో మనోహర్‌గౌడ్ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ఎస్ఐ నాగబాబు, ఏపీవో విజయమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్‌బద్రి, అంబేద్కర్ గురుకులప్రధానోపాధ్యాయులు నరసింహచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఓజిలి: మండల కేంద్రంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై అవగాహన ర్యాలీతో పాటు మానవహారం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని అన్ని పంచాయతీల్లో విజయవంతం చేయాలని కోరారు. ఇందులో భాగంగా అక్టోబరు 2వ తేదీ వరకు రోజువారీ కార్యక్రమాలు చేపట్టేందుకు షెడ్యూలు ప్రకటించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి శైలజ, కార్యదర్శులు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

పెళ్లకూరు, సెప్టెంబరు 17: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని చిల్లకూరుకు చెందిన పి.జయచంద్ర (57) ఈనెల 15న పెళ్లకూరు నుంచి స్వగ్రామానికి టీవీఎస్ ఎక్స్‌ఎల్ బైక్‌లో వెళ్తుండగా కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన జయచంద్రను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

మట్టి ట్రాక్టర్ల స్వాధీనం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 17: మండలంలోని పుదూరు పంచాయతీ అత్తలపాళెం చెరువులో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లు, ఒక ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసినట్లు వీఆర్వో మనోజ్ తెలిపారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు చెక్కు అందజేస్తున్న జితేష్

వాకాడు, సెప్టెంబరు 17: విజయవాడ వరద బాధితుల సహాయార్థం వాకాడు మండలం పంబలి ప్రాంతంలో ఉన్న కె.ఆంజనేయ మెరైన్ హేచరీ యజమాని జితేష్ రూ.లక్ష, కోట మండలం మహాలక్ష్మి హ్యాచరీస్ యజమాని సాగర్ రెడ్డి రూ.లక్ష, చెక్కులను మంగళవారం తిరుపతిలోని కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి అందజేశారు.

కరిమాణిక్యస్వామి ఆలయంలో శ్రీవారి లడ్డూల విక్రయం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 17: నాయుడుపేట తుమ్మూరులో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్య స్వామి ఆలయంలో భక్తులకు తిరుమల శ్రీవారి లడ్డూలు విక్రయిస్తున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ హరి తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

దొరవారిసత్రం, సెప్టెంబరు 17: మండలంలోని గొల్లపాళెం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో కృష్ణయ్య మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని నిర్వాహకులకు సూచించారు.

పాఠశాలకు వాటర్ క్యాన్ల పంపిణీ

చిట్టమూరు, సెప్టెంబర్ 17: మండల పరిధిలోని అరవపాళెం ఉన్నత పాఠశాలకు ఆరు కూలింగ్ వాటర్ క్యాన్‌లను టీడీపీ బీసీ సెల్ మండల అధ్యక్షుడు చెంచు రామయ్య ఆచారి హెచ్ఎం ప్రభావతికి అందజేశారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

బాలాయపల్లి, సెప్టెంబరు 17: ఆక్రమణదారుల నుంచి ప్రభుత్వ భూమిని కాపాడాలని మండలంలోని సిద్దాగుంట గ్రామస్తులు తహసీల్దార్ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో ఎక్కువ మంది మహిళలు పాల ఉత్పత్తి మీద ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఆక్రమణలతో పశువులు మేతకు భూములు లేకుండాపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

తడ, సెప్టెంబరు 17: మండలంలోని బోడిలింగాలపాడు వద్ద ఉన్న కాళికాదేవి ఆలయంలో మంగళవారం విశ్వకర్మ జయంతి నిర్వహించారు. అన్నదానం చేశారు. విశ్వకర్మ సంఘం మండల అధ్యక్షుడు పరంధామయ్య ఆచారి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, బాబు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి నిర్వహించారు. స్థానిక పీర్లచావడం వద్ద ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాస్కర్ ఆచారి, మాధవయ్య ఆచారి, వేణుగోపాల్, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి చర్యలు: పాశం

చిల్లకూరు, సెప్టెంబరు 17: మండలంలో ధ్వంసమైన రోడ్లను అభివృద్ధి పరిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం పారిచెర్లవారిపాళెం నుంచి ఉడతావారిపాళెం వరకు రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో భారీ వాహనాలతో సిలికా రవాణ చేయడం వల్ల రోడ్లు ధ్వంసమయ్యాయన్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రూ.74 లక్షలతో పారిచెర్లవారిపాళెం నుంచి ఉడతావారిపాళెం వరకు 8 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులు పనులకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ రామాంజనేయులు, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, లీలావతి, జడ్పీటీసీ శీనయ్య, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, వెంకటేశ్వర్లు నాయుడు, కుమార్‌యాదవ్, మునిశేఖర్‌గౌడ్, జానకిరామిరెడ్డి, నాగరాజు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ డీలర్ల లైసెన్స్ కొనసాగించాలి



మైనింగ్ ఏడీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎండీఎల్ సభ్యులు

చిల్లకూరు, సెప్టెంబరు 17: మైనింగ్ డీలర్ల లైసెన్స్(ఎండీఎల్)ను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఏడీ మైనింగ్ కార్యాలయం వద్ద మంగళవారం ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎండీఎల్ సభ్యులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు నుంచి సిలికా, క్వార్ట్జ్ మైనింగ్ నిర్వహిస్తున్న ఎండీఎల్‌ను నిలుపుదల చేశారన్నారు. అయితే ఇప్పటి వరకు కొనసాగించలేదన్నారు. ఉన్నతాధికారులు పరిశీలించి అనుమతులను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎండీఎల్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్‌కు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 17: ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కడపజోన్ ఈడీ చెంగల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో డీజల్ మెకానిక్ 97, మోటార్ మెకానిక్ 6, ఎలక్ట్రీషియన్ 25, వెల్డర్ 4, పెయింటర్ 2, ఫిట్టర్ 9, డ్రాఫ్ట్‌మెన్ సివిల్ ఒకటి పోస్టులు ఖాళీలున్నాయి. నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని ఎస్పీఎస్ఆర్‌లో ఐటీఐలో ఉత్తీర్ణులైనవారు మాత్రమే అర్హులన్నారు. అక్టోబరు 3వతేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. వివరాలకు 9154291408 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

పెరుమాళ్లపల్లిలో పోషకాహార వారోత్సవాలు

పెళ్లకూరు, సెప్టెంబరు 17: మండలంలోని అనకవోలు పంచాయతీ పెరుమాళ్లపల్లిలో మంగళవారం పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సాయిలక్ష్మి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీల్లో అందించే పోషకాహారాన్ని తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రవీణ, సింధూజ, గీతాంజలి, మంగమ్మ, అంకమ్మ తదితరులు ఉన్నారు.

రావిపాడులో తాగునీటి సమస్య

ఓజిలి, సెప్టెంబరు 17: ఓజిలి మండలం రావిపాడు గ్రామస్తులు 20 రోజులుగా తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మోటారుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో సమస్య నెలకొందని గ్రామస్తులు అంటున్నారు. సచివాలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో రజనీకాంత్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఆయన మోటారుకు వెంటనే మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.

ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించండి



తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న వజ్జావారిపాళెం గ్రామస్తులు

కోట, సెప్టెంబరు 17: ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించాలంటూ స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట వజ్జావారిపాళెం గ్రామస్తులు మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిట్టేడు పంచాయతీ వజ్జావారిపాళెం సర్వే నెంబరు 521-2, 522లో 140 ఎకరాల అడవి పొరంబోకు భూమిని స్థానికంగా ఉన్న నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీలకు చెందిన 90 కుటుంబాలు సాగు చేసుకొంటున్నాయని తెలిపారు. అయితే కొంతమంది స్థానికేతరులు దొంగ పట్టాలను సృష్టించి ప్రభుత్వ భూమిని కాజేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఆ భూములను భూమిలేని నిరుపేదలకు పంచిపెట్టాలని కోరుతూ తహసీల్దారు జయజయరావుకు వినతిపత్రం అందజేశారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి



సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు

గూడూరు, సెప్టెంబరు 17: నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు అన్నారు. మంగళవారం స్థానిక త్యాగరాజవీధిలో పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసర వస్తువుల ధరలు అమాంతం పెరిగిపోవడంతో పేదలు అవస్థలు పడుతున్నారన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకువద్దామన్నారు. కార్యక్రమంలో పరిమల వెంకటేశ్వరరావు, వేమయ్య, రత్నం, సతీష్‌బాబు, శ్రీనివాసులు, రాధయ్య, దామోదరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: కాంగ్రెస్ పార్టీని బలోపేతమే చేయడమే తమ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాలగురవం బాబు అన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌అండ్‌బీ బంగ్లాలో మీడియాతో మాట్లాడారు. రాహుల్ గాంధీ నేతృత్వంలో దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ బలపడిందనడానికి మూడు నెలల క్రితం జరిగిన ఎన్నికలే నిదర్శనమన్నారు. బీజేపీ రెండు పర్యాయాలు అధికారంలో ఉండీ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. ప్రజల సమస్యల పోరాటం చేస్తూ పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా అందరూ కలిసి పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బెద్దపూడి రాజారెడ్డి, మావుడూరు వెంకటా చలపతి తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

బాలాయపల్లి, సెప్టెంబరు 17: మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని ఎంపీడీవో వినీల్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని అలిమిలి, పల్లిపాడు గ్రామాల్లో అవెన్యూ ప్లాంటేషన్ ద్వారా మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో మృత్యుంజయరావు, ఈవోపీఆర్డీ మోహన్‌రాజు, ఈసీ కరుణాకర్ రెడ్డి, టీఏ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జనసేన సంబరాలు

వెంకటగిరి, సెప్టెంబరు 17: రాష్ట్రంలోని అన్ని పంచాయతీల్లో ఒకేరోజు గ్రామసభలు నిర్వహించినందుకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గిన్నీస్ బుక్ రికార్డులో నమోదయ్యారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జనసేన నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. కార్యక్రమంలో నాయకులు తోట కృష్ణయ్య, తిరుపాల్, రేవతి, కస్తూరి, రాజేష్, కరెంట్ విజయ, నాగరత్నమ్మ, రవీంద్ర, పశుపులేటి మురళి పాల్గొన్నారు.

గణనాథుల గ్రామోత్సవం



కోట, సెప్టెంబరు 17: మండల పరిధిలోని విద్యానగర్, ప్రకాశంకాలనీలో మంగళవారం గణనాథుల గ్రామోత్సవం జరిగింది. భారీ వినాయక విగ్రహాలతో యువత కేరింతలు కొడుతూ గ్రామోత్సవాలు నిర్వహించారు. మేళతాళాల నడుమ విగ్రహాలను ఊరేగించి మండల పరిధిలోని శ్రీనివాససత్రం సముద్ర తీరంలో నిమజ్జనం చేశారు.